ప్రజాశక్తి

శుక్రవారం 24 మే 2024


8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి



పెరుగుతున్న వేడి

- ఉక్కిరిబిక్కిరవుతున్న నగర జీవులు
- పలుచోట్ల కరెంట్ కోతలు
- తప్పని తాగునీటి కష్టాలు
- అల్పపీడన ప్రభావం మనకు లేనట్టే...

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

మే నెల చివర్లో ఉన్నా సరే వాతావరణంలో వేడి ఏ మాత్రమూ తగ్గలేదు. దీంతో నగర వాసులు ఉష్ణోగ్రతలతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. విశాఖలో ఎండలు అధికంగానే ఉన్నాయి. వర్షాలు ఎప్పుడు పడతాయా ? అని జనం ఎదురు చూస్తున్నారు. ఈ నెల 19న ఏర్పడిన అల్పపీడనం పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ప్రస్తుతం ఉంది. రానున్న రెండు రోజుల్లో మధ్య బంగాళాఖాతంలోకి ఇది వెళ్లనుంది. దీని ప్రభావం ఆంధ్రాపై ఉండదు. అయితే, ఉమ్మడి విశాఖలోని అల్లూరి జిల్లాలో మాత్రం అడపాదడపా రాగల రెండు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశముంది. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ఈ అల్పపీడన ప్రభావం లేనందున పొడి వాతావరణం నెలకొననుంది. దీంతో పగటి ఉష్ణోగ్రతలు పెరగనున్నాయి. సాధారణం కంటే ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఇక ఎండల కారణంగా ఉక్కపోత పెరగనుంది.


విశాఖలో పలు ప్రాంతాల్లో రాత్రి వేళల్లో ఇప్పటికే కరెంట్ కోతలు పెరిగాయి. దీంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. పంప్‌సెట్లకు కరెంట్ అందకపోవడంతో తాగునీటి సరఫరాలో కూడా అంతరాయం నెలకొనే పరిస్థితులు కనిపిస్తున్నాయి. పైప్‌లైన్లు ఇప్పటికే పలుచోట్ల మరమ్మతులకు గురౌతున్నాయి. దీని ప్రభావంతో ఈ నెల 24న నగరంలోని సీతమ్మధారలోగల నార్త్ ఎక్స్‌టెన్షన్ లే అవుట్, రాధాకృష్ణ లే అవుట్, కెఆర్ఎం.కాలనీ, భానునగర్, టిపిటి కాలనీ, పిఅండ్‌టి కాలనీల్లో తాగునీటిని సరఫరా చేయలేమని జివిఎంసి గురువారం రాత్రి ప్రకటించింది.

విశాఖలో 39 డిగ్రీలు

గురువారం విశాఖలో 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. తిరుపతి, కర్నూలు, అమరావతి తదితర చోట్ల కూడా ఇవే ఉష్ణోగ్రతలు మిగతా 2లో..



కేసు వివరాలు వెల్లడిస్తున్న సిఐ శ్రీనివాసరావు



స్వాధీనం చేసుకున్న వస్తువులు

అంతరాష్ట్ర దొంగల ముఠా గుట్టు రట్టు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : తమిళనాడు నుంచి వచ్చి విశాఖ కేంద్రంగా పలు ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు సభ్యుల ముఠాలో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. కేసు వివరాలను గురువారం మధ్యాహ్నం ఎంవిపి.కాలనీ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ద్వారకా డివిజన్ క్రైమ్ సిఐ సిహెచ్.శ్రీనివాసరావు మీడియాకు వెల్లడించారు. తమిళనాడు రాష్ట్రం వెల్లూరు జిల్లా, పెరియపాలెం గ్రామానికి చెందినా గణేష్ శంకర్, వి.మంజునాథన్‌తో పాటు మరొక వ్యక్తి విజయనగరంలో ఇల్లు అద్దెకు తీసుకుని ప్రతి రోజు ఉదయం విశాఖపట్నం వచ్చి ఇక్కడ దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో ఎంవిపి కాలనీ సెక్టార్-9కు చెందిన మధుసూరి వివిఎస్ ఫణి కిరణ్ వర్మ ఈ నెల 21న ఉదయం తన ఫ్లాట్‌లో దొంగతనం జరిగిందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ప్రాంతంలో ప్రత్యేక బృందం ద్వారా పోలీసులు నిఘా పెట్టగా గురువారం ఉదయం వెంకోజీపాలెం వద్ద నిందితుల్లో గణేష్ శంకర్, వి.మంజునాథన్ పట్టుబడ్డారు. వీరితో కలిసి దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి కోసం పోలీసులు గాలిస్తున్నారు. అరెస్ట్ అనంతరం నిందితుల నుంచి రూ.1,50,000 విలువగల 6 ల్యాప్‌టాప్‌లను, 3 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఐపిఎల్ బెట్టింగులకు, చెడు వ్యసనాలకు బానిసలుగా మారడంతో ఆదాయం సరిపోక దొంగతనాలకు పాల్పడుతున్నారని, వీరు ఆంధ్రాలోనే కాకుండా కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోనూ పలు చోరీల్లో పాల్గొన్నారని సిఐ తెలిపారు.

40 ఎకరాల ప్రభుత్వ భూమిపై కన్ను

▶ వార్త 5లో..

26న విశాఖలో ఓపెన్ చెస్ టోర్నీ

▶ వార్త 2లో..

జీవవైవిధ్య పరిరక్షణతో ఆహార భద్రత

▶ వార్త 4లో..



బ్యాటరీ కారును నడుపుతున్న కలెక్టర్ మల్లికార్జున

ఆర్ఐఎన్ఎల్ ఉదారత

కెజిహెచ్ రోగుల కోసం 5 బ్యాటరీ కార్ల వితరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్‌లో రోగుల రవాణా కోసం రూ.40 లక్షలు విలువ చేసే, 24 గంటలూ పనిచేసే 5 బ్యాటరీ కార్లను ఆర్ఐఎన్ఎల్ తన సామాజిక బాధ్యతలో భాగంగా అందజేసింది. గురువారం కెజిహెచ్‌లో జరిగిన కార్యక్రమంలో ఆ వాహనాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, ఆర్ఐఎన్ఎల్ అదనపు ఛార్జ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎకె.బాగ్చి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మిగతా 2లో..

భద్రత పటిష్టం

- హింసకు పాల్పడితే చర్యలు
- సమస్యాత్మక గ్రామాలు గుర్తింపు
- అల్లర్ల నియంత్రణకు క్విక్ రియాక్షన్ పెట్రోలింగ్ టీమ్స్
- స్ట్రాంగ్ రూమ్‌కు మూడంచెల బందోబస్తు
- రౌడీ షీటర్లు, వివాదాస్పద వ్యక్తులపై ప్రత్యేక నిఘా
- ర్యాలీకి అనుమతి తప్పనిసరి
- 'ప్రజాశక్తి'తో అనకాపల్లి ఎస్‌పి మురళీకృష్ణ



ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

'జిల్లాలో ఓట్ల లెక్కింపు రోజు, ఫలితాల అనంతరం ఎటువంటి హింసాత్మక, ప్రేరేపిత చర్యలకు పాల్పడకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలి. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా జూన్ ఒకటి నుంచి బందోబస్తు ఏర్పాటుచేస్తాం. సమస్యాత్మక గ్రామాల్లో పర్యవేక్షణకు పెట్రోలింగ్ టీమ్స్‌ను సిద్ధంచేశాం. చట్ట వ్యతిరేక, హింసాత్మక కార్యక్రమాల్లో ప్రత్యక్ష, పరోక్ష పాత్ర కలిగిన వారిపై కఠిన చర్యలుంటాయి. రౌడీషీటర్లు, వివాదస్పద వ్యక్తుల నివాసిత ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా వుంటుంది. స్ట్రాంగ్ రూమ్‌లకు మూడంచెల భద్రత వుంది. నాలుగు వైపులా చెక్‌పోస్టులున్నాయి. స్ట్రాంగ్ రూమ్‌కు రెండు కిలోమీటర్ల పరిధిలో 144 సెక్షన్ వుంది. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేలా అన్ని చర్యలూ తీసుకున్నాం' అని ఎస్‌పి కెవి.మురళీకృష్ణ 'ప్రజాశక్తి'కి తెలిపారు. కౌంటింగ్ రోజున, అనంతరం అల్లర్లు జరగకుండా తీసుకొనే భద్రతా చర్యలను ఆయన వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

స్ట్రాంగ్‌రూమ్‌ల భద్రత ఎలా వుంది ?

సిఆర్‌పిఎఫ్, ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు పర్యవేక్షణలో ఇవిఎంల స్ట్రాంగ్ రూమ్ వుంది. నాలుగు వైపులా మూడు షిఫ్ట్‌ల్లో భద్రత పటిష్టం చేశాం. సిసి కెమెరాలు ఏర్పాటుచేశాం. పోలీసు, రెవెన్యూ నిరంతర పర్యవేక్షణలో స్ట్రాంగ్‌రూమ్ కంట్రోల్ రూమ్ వుంది.

లెక్కింపు రోజు తీసుకునే చర్యలేంటి ?

రెడ్‌జోన్ కింద పరిగణించి స్ట్రాంగ్ రూమ్‌కు రెండు కిలోమీటర్ల మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

పెరుగుతున్న వేడి

నమోదయ్యాయి. సాయంత్రం వేళలో చినుకులైనా పడతాయని ఆశించిన విశాఖ వాసులకు గడచిన మూడు రోజులుగా నిరాశే ఎదురవుతోంది. మరోవైపు ఎంవిపి కాలనీ, ఎండాడ, అక్కయ్యపాలెం, కెఆర్‌ఎం కాలనీ ఇలా పలుచోట్ల బుధవారం రాత్రి కరెంట్ కోతలు నెలకొనడంతో జనం అల్లాడిపోయారు. ఈ నెల 30 వరకూ పగటి పూట వేడి అధికంగా ఉంటుందని విశాఖ వాతావరణ కేంద్రం అధికారులు తాజాగా వెల్లడించారు. పశ్చిమ మధ్య బంగాళాఖాతాన్ని ఆనుకుని ఉన్న నైరుతి బంగాళాఖాతంలోగల అల్పపీడనం తీవ్ర వాయుగుండంగా ఈ నెల 25 నాటికి మారనుంది. అయితే దీని ప్రభావం ఆంధ్రా తీరంపై పెద్దగా ఉండనందున ఉష్ణోగ్రతల్లో పెద్ద తగ్గుదల ఏమీ ఉండదని స్పష్టమవుతోంది. పశ్చిమ బెంగాల్, ఒడిశా ప్రాంతాల్లో ఈ నెల 25 తర్వాత వర్షాలు మోస్తరుగా పడడమే కాకుండా బెంగాల్ తీరాన్ని తాకి తుపానుగా బలపడే అవకాశాలున్నాయి. రాగల మూడు రోజుల వరకూ విశాఖపట్నం, ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో పెద్దగా వర్షాలు కురిసే అవకాశాల్లేవు. రాగల రెండు రోజుల్లో పలుచోట్ల వడగాల్పులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

భద్రత పటిష్టం

పరిధిలో 144 సెక్షన్ వుంది. మూడంచెల భద్రత వ్యవస్థ వుంది. ప్రస్తుతం కలెక్టరేట్‌కు వచ్చిన వారిని తరువుగా పరిశీలించి పంపిస్తున్నాం. జూన్ 4న లెక్కింపు రోజు పాస్‌లు కలిగిన సంబంధిత వ్యక్తులను లోపలకు అనుమతిస్తాం. లెక్కింపు ప్రశాంతంగా జరిగేలా భద్రత ఏర్పాట్లు చేశాం.

లెక్కింపు తరువాత అల్లర్ల నియంత్రణకు చేసిన ఏర్పాట్లు ఏంటి?

శాంతిభద్రతలకు విఘాతం లేకుండా జూన్ ఒకటి నుంచి భద్రతను పటిష్టం చేయనున్నాం. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నాం. 24 మండలాల్లోని 30 పోలీసు స్టేషన్ల పరిధిలో జరిగిన, జరుగుతున్న ఘటనల ఆధారంగా పోలీసు పికెట్ ఏర్పాటుచేస్తాం. అల్లర్ల నియంత్రణకు క్విక్ రియాక్షన్, పెట్రోలింగ్ టీమ్ వ్యవస్థను ఏర్పాటుచేశాం. సమస్యాత్మక గ్రామాలు, వివాదాస్పద వ్యక్తులను గుర్తించి వారి నివాసిత, సంచరించే ప్రాంతాల్లో పెట్రోలింగ్ టీమ్‌లు తిరగనున్నాయి. అభ్యర్థులు, వారి పార్టీ కార్యాలయాల్లో ఏర్పాటుచేసే ప్రత్యేక భద్రత జూన్ ఒకటి నుంచి ఆరు వరకు కొనసాగనుంది.

అల్లర్లకు అవకాశమున్న గ్రామాలను గుర్తించారా ?

జిల్లాలో 202 సమస్యాత్మక గ్రామాలను గుర్తించాం. ఈ గ్రామాలపై ప్రత్యేక నిఘా వుంటుంది. జిల్లా వ్యాప్తంగా 1300 మంది పోలీసులను భద్రతకు ఉపయోగిస్తాం. ఫలితాల వెలువడిన రోజున విజేతలు ప్రదర్శనలు చేయకూడదు. తరువాత కూడా తప్పనిసరిగా పోలీసు అనుమతి తీసుకోవాలి. అనుమతి లేకుండా ర్యాలీలు నిర్వహించే వారిపై చర్యలుంటాయి.

జిల్లా ప్రజలకు మీరిచ్చే సందేశం ఏంటి ?

లెక్కింపు రోజుగానీ, ఫలితాల తరువాతగానీ అల్లర్లకు అవకాశంలేకుండా నాయకులు, కార్యకర్తలకు అభ్యర్థులు సూచనలు చేయాలి. సంయమనం కోల్పోకుండా వ్యవహరించాలి. సమస్య వుంటే తెలియజేయాలి. హింసాత్మక చర్యలకు పాల్పడకూడదు. ఇప్పటికే పోలీసు స్టేషన్‌లో బైండోవర్లకు, రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్నాం. అయినా హింసకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలుంటాయి. చట్టవ్యతిరేక, హింసాత్మక కార్యక్రమాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా భాగస్వామి కాకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్త తీసుకోవాలి.

ఆర్ఐఎన్ఎల్ ఉదారత

ఎంతో సేవాతత్పరతతో రోగులకు సహాయ పడే బ్యాటరీ కార్లను కెజిహెచ్‌కు అందజేసినందుకు ఆర్ఐఎన్ఎల్ విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ యాజమాన్యాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు. రోగులకు ఎంతగానో సహాయపడే బ్యాటరీ కార్లను అందజేసినందుకు కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్ కుమార్ విశాఖ ఉక్కు కర్మాగార యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. ఆర్ఐఎన్ఎల్ అదనపు ఛార్జ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎకె.బాగ్చి మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారం సమాజ శ్రేయస్సు కోసం ఎన్నో సంవత్సరాలుగా ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేస్తోందని, ఇటువంటి ఒక ఉదాత్తమైన కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. ఈ ఐదు బ్యాటరీ కార్లు వృద్ధులు, వికలాంగులు, గాయపడినవారు, గర్భిణులు, తల్లీ బిడ్డ, ఇతర నిరుపేదలకు కెజిహెచ్ ఆవరణలో అందుబాటులో ఉంటాయన్నారు. క్యాజువాలిటీ, ఒపి వార్డు, ఇతర వార్డులు, ల్యాబ్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లకు వెళ్లేందుకు సహాయపడతాయన్నారు. కార్యక్రమంలో ఆర్ఐఎన్ఎల్ సిజిఎం (సర్వీసెస్) ప్రవీణ్ కుమార్, ఆంధ్ర మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, సిహెచ్.శ్రీనివాసరావు, ఇవిఆర్.రాజు పాల్గొన్నారు.

ఆలయాల సందర్శనలో వాసుపల్లి దంపతులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వైశాఖీ పౌర్ణమి సందర్భంగా వైసిపి దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్, ఉషారాణి దంపతులు గురువారం పలు ఆలయాలను సందర్శించారు. పౌర్ణమి రోజున విశిష్టత కలిగిన సత్యనారాయణ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ జగన్నాథ స్వామి దేవాలయంలో శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి వారి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ వద్ద 16 మంది నిరాశ్రయులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎయుటిడి, అర్‌పిఎఫ్ సిబ్బంది సంయుక్తంగా గురువారం విశాఖ రైల్వే స్టేషన్‌లో చేపట్టిన రెస్క్యూ ఆపరేషన్‌లో 16 మంది నిరాశ్రయులను గుర్తించారు. రైల్వే స్టేషన్ పరిసరాల్లో బెగ్గింగ్ చేసుకుంటూ, రోజుల తరబడి అక్కడే తిష్ట వేసుకుని ఉంటున్న వారందరినీ టిఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని మెన్, ఉమెన్ సెంటర్లకు తరలించారు. వారిలో 13 మంది మగవారు, ముగ్గురు మహిళలు ఉన్నారు. భిక్షాటనకు అలవాటు పడి వారిలో కొంత మంది బయటికి వెళ్లిపోతామని గొడవ చేస్తున్నారని, వారందరికీ కౌన్సిలింగ్ ఇచ్చి బెగ్గింగ్‌కు దూరం చేసే ప్రయత్నం చేస్తున్నామని ఎయుటిడి నిర్వాహకులు మీడియాకు తెలిపారు.

కౌంటింగ్ నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ నిర్వహణకు జిల్లాలో పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ చోటు చేసుకోకుండా మూడంచెల భద్రతా ప్రమాణాలను పాటిస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. నిర్ణీత సమయంలోగా ఫలితాలను వెల్లడించేందుకు అనుగుణంగా ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ప్రణాళికాయుత చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. గురువారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కౌంటింగ్ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు, ఇతర అంశాలపై సమీక్షించారు. జిల్లా కలెక్టరేట్ విసి హాలు నుంచి జిల్లా కలెక్టర్, ఎంసిసి నోడల్ అధికారి సిఎం.సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ఎడిసి కె.ఎస్.విశ్వనాథన్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్ వీడియో కాన్ఫరెన్స్‌లో భాగస్వామ్యమయ్యారు. ఈ సందర్భంగా కౌంటింగ్ నిర్వహణకు సంబంధించి జిల్లాలో చేపట్టిన చర్యలను జిల్లా ఎన్నికల అధికారి సిఇఒకు వివరించారు. కేంద్ర బలగాలతో పాటు సుమారు 500 మంది సివిల్ పోలీసులు భద్రతా చర్యలను పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు. 176 సిసి కెమెరాలు అమర్చామని, వాటిని మానిటరింగ్ రూమ్‌నకు అనుసంధానం చేసి రోజువారీ పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో కౌంటింగ్ నిర్వహణకు సంబంధించి ఎయు పరిధిలో ఏడు హాళ్లు గుర్తించామని, నియోజకవర్గానికి రెండేసి చొప్పున మొత్తం 98 టేబుళ్లు ఏర్పాటు చేశామని అన్నారు. మొత్తం 140 రౌండ్లలో కౌంటింగ్ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని వివరించారు. ఒక్కో టేబుల్‌కు గాను ఒక్కో కౌంటింగ్ సూపర్‌వైజర్, ఒక్కో కౌంటింగ్ అసిస్టెంటు, ఒక్కో మైక్రో అబ్జర్వర్‌ను నియమించామని చెప్పారు. పార్లమెంటు పరిధిలోని పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ప్రక్రియను మూడు రౌండ్లలో నిర్వహించనున్నామని, దానికిగాను రెండు హాళ్లను గుర్తించామని, 18 టేబుళ్లను కేటాయించామని వివరించారు. 18 మంది కౌంటింగ్ సూపర్ వైజర్లను, 36 మంది కౌంటింగ్ అసిస్టెంట్లను, మరొక 18 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామన్నారు. జిల్లాలోని అసెంబ్లీలకు వచ్చేసరికి పార్లమెంటుతో కలిపే అన్ని ఏర్పాట్లు చేశామని అదనంగా పెందుర్తి నియోజకవర్గానికి సంబంధించి మరొక మూడు రౌండ్లు పార్లమెంటు పరిధిలో పెరుగుతాయని స్పష్టం చేశారు.

అసెంబ్లీల పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకుగాను ఐదు హాళ్లలో 33 టేబుళ్లు ఏర్పాటు చేశామని, 15 రౌండ్లలో లెక్కింపు పూర్తి కానుందని వెల్లడించారు. సంబంధిత అధికారులకు, సిబ్బందికి నిర్ణీత కాలంలో శిక్షణ అందిస్తామని, ఈ నెల 25న తొలి విడత ర్యాండమైజేషన్, జూన్ 2న రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహిస్తామని వివరించారు.

పలు రైళ్లు రద్దు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పుండి - నౌపడా - కోటబొమ్మాళి సెక్షన్‌లో వంతెన పునర్నిర్మాణ పనుల కారణంగా నౌపడా యార్డ్, పర్లాకిమిడి యార్డ్ మీదుగా మే 24, 27 తేదీల్లో నడిచే పలు రైళ్లను రద్దు చేసినట్టు రైల్వే అధికారులు తెలిపారు. మరికొన్ని రైళ్లను షార్ట్ టర్మినేట్‌తో పాటు రీ షెడ్యూల్ చేసినట్టు వెల్లడించారు. ఈ మేరకు రైల్వే శాఖ సీనియర్ డిసిఎం కె.సందీప్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆ మేరకు 08522 విశాఖపట్నం - గుణుపూర్ ప్యాసింజర్, 08521 గుణుపూర్ - విశాఖపట్నం ప్యాసింజర్ రైళ్లను మే 24 నుంచి మే 27 వరకు, 07471 పలాస - విశాఖపట్నం ప్యాసింజర్, 07470 విశాఖపట్నం - పలాస ప్యాసింజర్ రైళ్లను మే 27న రద్దు చేశారు.

18117 రూర్కెలా - గుణుపూర్ రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్ రూర్కెలా నుంచి మే 23, 26 తేదీల్లో గుణుపూర్‌కు బదులు పలాసలో షార్ట్ టర్మినేట్ చేయబడుతుంది. కావున 18118 రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్ మే 24, 27 తేదీల్లో పలాస నుండి రూర్కెలాకు తిరిగి వెళ్తుంది. అదేవిధంగా 18417 పూరి -గుణుపూర్ ఎక్స్‌ప్రెస్ మే 27న పలాసలో షార్ట్ టర్మినేట్ చేయబడుతుంది. కావున 18418 గుణుపూర్- పూరి ఎక్స్‌ప్రెస్ పలాస నుంచి పూరీకి తిరిగి వెళ్తుంది.

18526 విశాఖపట్నం - బ్రహ్మపూర్ ఎక్స్‌ప్రెస్ మే 27న సాధారణ సమయం మధ్యాహ్నం 15.00 గంటలకు బదులుగా ఒక గంట ఆలస్యంగా సాయంత్రం 16.00 గంటలకు విశాఖపట్నం నుంచి బయలుదేరుతుంది. 07225 సికింద్రాబాద్ - షాలిమార్ సమ్మర్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ మే 27న సాధారణ సమయం ఉదయం 04.30 గంటలకు బదులుగా ఒక గంట ఆలస్యంగా 05.30 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరుతుంది. 07234 సికింద్రాబాద్ - సంత్రాగచ్చి సమ్మర్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ మే 26 రాత్రి 23.40 గంటలకు బయలుదేరాల్సి ఉండగా 3 గంటలు ఆలస్యంగా మే 27 తెల్లవారుజామున 02.40 గంటలకు సికింద్రాబాద్‌లో బయల్దేరుతుంది.



నర్సింగ్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న యూనియన్ నాయకులు

యుజిడి కార్మికుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఇటీవల మరణించిన జోన్ 3 యుజిడి కార్మికుడు నర్సింగ్ కుటుంబానికి జివిఎంసి యుజిడి వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆర్థిక సాయం అందించింది. సంఘం అధ్యక్షులు ఇ.ఆదినారాయణ ఆధ్వర్యంలో యుజిడి ఆరు జోన్ల కార్మికులు స్పందించి నర్సింగ్ కుటుంబానికి రూ.62 వేలును అందించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు ఇ.ఆదినారాయణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ కోస్టల్ బ్యాటరీ నుండి పార్క్ హోటల్ వరకూ ఉన్న వీధి వర్తకులకు గురువారం స్వచ్ఛ సర్వేక్షణ్‌పై బీచ్ రోడ్డులోని అన్నమయ్య పార్కులో అవగాహన కల్పించారు. వారినుద్దేశించి జివిఎంసి మూడో జోన్ వైద్య, ఆరోగ్య సహాయక అధికారి బి.ప్రసాద్‌రావు మాట్లాడుతూ మహా విశాఖ సముద్ర తీర పరిశుభ్రతకు మేము సైతం అంటూ విశాఖ నగర బీచ్ వీధి వర్తకుల సంక్షేమ సంఘం స్వచ్ఛందంగా సహకారమందించడం అభినందనీయమని అన్నారు. విశాఖ సముద్ర తీర ప్రాంతం నగరానికి ప్రకృతి వరమని, దీనిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. సుందర విశాఖ నగరానికి నిత్యం పర్యాటకులు, సందర్శకులు వస్తున్నందున వారందరికీ ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడంలో బీచ్ వీధి వర్తకుల పాత్ర కీలకమైనదని అన్నారు. తీరంలో వ్యర్థాలు పడవేయకుండా సందర్శకులకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జివిఎంసి శానిటరీ సూపర్‌వైజర్ సత్యనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోవింద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రసాదరావు

26న ఓపెన్ చెస్ టోర్నీ

ప్రజాశక్తి - విశాఖపట్నం : ఆల్ విశాఖ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టౌన్ కొత్తరోడ్ పాత పోస్టు ఆఫీస్ సమీపంలో ఉన్న శ్రీవాసవి కల్యాణ మండపంలో ఈ నెల 26న ఆదివారం ఓపెన్ చెస్ టెర్నమెంట్‌ను రూ.50 వేల క్యాష్ ప్రైజ్‌తో నిర్వహించనున్నారు. ఈ మేరకు టోర్నమెంట్ డైరెక్టర్ బాబూరావు, అర్గనైజింగ్ సెక్రటరీ శ్రీకాంత్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ టోర్నమెంట్‌లో అన్ని వయస్సులవారూ పాల్గొనవచ్చునని తెలిపారు. ఆసక్తిగల వారు 9989971232, 9849371760 నెంబర్లను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రసరించిన విజ్ఞాన చైతన్యం



వేసవి శిక్షణ శిబిరాలకు హాజరైన విద్యార్థులు

విద్యార్థులకు ప్రయోజనకరంగా వేసవి శిబిరాలు
పిల్లల్లో వినోదం, విజ్ఞానం పెంపుదల

ప్రజాశక్తి -భీమునిపట్నం

విద్యార్థుల్లో ప్రతిభ, వారి సామర్థ్యాన్ని అంచనా వేస్తూ, ఆ దిశగా అవసరమైన పుస్తకాలు అందిస్తూ వారిలో వినోదం, విజ్ఞానం, సృజనాత్మకత పెంపొందించేలా పౌర గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యాన స్థానిక శాఖా గ్రంథాలయంలో మే 15న ప్రారంభమైన వేసవి విజ్ఞాన శిబిరం జూన్ 7వరకు కొనసాగనుంది. 8 నుంచి 15 ఏళ్ల లోపు పిల్లలకు ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 11.30 గంటల వరకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నారు. గత 10రోజుల నుంచి కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరానికి పిల్లల నుంచి స్పందన లభిస్తోంది.

ఏమి నేర్చుకున్నారు..

కథలు చెప్పడం, పుస్తక పఠనం, చిత్ర లేఖనం, బాల సాహిత్యం, పద్యాలు, పఠనాభిరుచి, అందమైన చేతి రాత, ఇలా అనేక అంశాలపై స్థానిక శాఖా గ్రంథాలయంలో పిల్లలకు శిక్షణ ఇస్తున్నారు. నలుగురితో ఎలా కలవాలి, ఎటువంటి స్నేహితులను ఎంచుకోవాలి, మంచి వైపుగా ఎలా ఆలోచించాలి ఇలా అనేక అంశాలను పిల్లలకు నేర్పుతున్నారు.

గ్రంథాలయాల పట్ల ఆకర్షితుల య్యేలా..

వివిధ పాఠశాలలకు చెందిన 3 నుంచి 9వ తరగతి విద్యార్థులు రోజూ స్థానిక శాఖా గ్రంథాలయానికి వచ్చి వివిధ పోటీల్లో ఉత్సాహంగా పాలు పంచుకుంటున్నారు. తెలుగు, ఇంగ్లీష్ దిన పత్రికలు, ఇక్కడ అందుబాటులో ఉన్న అనేక పుస్తకాలను చదువుతున్నారు. పాఠశాలలు తెరిచాక ఆదివారం, ఇతర సెలవు దినాల్లో, పాఠశాల ముగిశాక సాయంకాల సమయాన గ్రంథాలయానికి వెళ్లోద్దాం అన్న ఆసక్తి పిల్లల్లో ఏర్పడింది. ఎనిమిదేళ్ళ వయసు నుంచే గ్రంథాలయాల బాట పట్టించాలన్న ఆ సంస్థ ఆలోచన, కృషి మంచి ఫలితాలు ఇస్తుందనే చెప్పాలి. చుట్టు పక్కల వాతావరణాన్ని బట్టి ఎంత బుద్ధి గల పిల్లలైనా చెడు బుద్ధుల వైపు మరలక మానరు. తల్లి దండ్రులు, కుటుంబ సభ్యులు, పిల్లలను మంచి మార్గంలోకి మరల్చాలి. పిల్లలకు ర్యాంకులు, మార్కులే జీవితం అనుకోకూ డదు. ఆట, పాటలు కూడా అవసరమే. ఈ అవసరాన్ని గుర్తించిన పౌర గ్రంథాలయ సంస్థ 24 రోజుల పాటు వేసవి శిబిరం నిర్వహిస్తుంది. ఇంతటి బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టి వినోదంతో కూడిన విజ్ఞానాన్ని అందిస్తుంది.

కథల పుస్తకాలు చదువుతున్నాను

రోజూ తరగతి పుస్తకాలు చదివే దాన్ని. ప్రస్తుత వేసవి విజ్ఞాన శిబిరంలో బాల సాహిత్యం, కథల పుస్తకాలు చదువుతున్నాను.

సిహెచ్.దుర్గ
8వ తరగతి



ఎన్నో విషయాలు నేర్చుకున్నా...

ఇక నుంచి సమయం ఉన్నప్పుడల్లా గ్రంథాలయానికి వెళ్తాను. గత 10రోజులుగా అనేక కథల పుస్తకాలు చదివాను. నాకు తెలియని ఎన్నో విషయాలు ఇక్కడ నేర్చుకున్నాను.

కె.శరణ్య
9వ తరగతి



పోటీతత్వం పెరిగింది

కేరమ్స్ ఆట ఆడుతున్నప్పుడు ఎంతో సరదాగా ఉంటుంది. బొమ్మలు గీయడం నేర్చుకున్నాను. తోటి విద్యార్థి కంటే మెరుగ్గా ఆడాలనే పట్టుదల పెరిగింది. వేసవి విజ్ఞాన శిబిరంలో ఎన్నో మంచి విషయాలు నేర్చుకున్నాను.

కె.సతీష్
6వ తరగతి



నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి -భీమునిపట్నం, ఆనందపురం : నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్ జోన్ 3 ఇఇ పోలాకి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రేహౌండ్స్ 11 కెవి ఫీడర్ పరిధిలో నిర్వహణ పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో నాలుగో వార్డు పరిధి గ్రేహౌండ్స్, తిమ్మాపురం, హేచరీలు తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఆనందపురం : బోయపాలెం ఇండస్ట్రియల్, 11కెవి కెకె.పాలెం, 11కెవి పరదేశిపాలెం లైన్ నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బోయపాలెం, గంబీరం, గంబీరం ఎపిఐఐసి, కొత్త కళ్లివానిపాలెం గ్రామాలకు సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ సురేష్ కుమార్ తెలిపారు. గృహ, పారిశ్రామిక వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఘనంగా పిఆర్ సర్కార్ జయంతి

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరానగర్‌లోని ఆనంద్‌మార్గ్ సంస్థ వ్యవస్థాపకులు కీర్తిశేషులు పిఆర్ సర్కార్(బాబా) 103వ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లాలో ఉన్న సంస్థ సభ్యులు వేకువ జామున 5 గంటలకు ఆశ్రమంలో సామూహిక ధ్యానం, భజన కార్యక్రమం చేపట్టారు. అనంతరం బాబా జీవిత చరిత్రకు సంబంధించిన కొన్ని అంశాలపై చలనచిత్ర ప్రదర్శన, బాబా రచించిన భక్తి గీతాలతో చిల్డ్రన్ హోమ్ బాల బాలికలు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. సహపంక్తి భోజనాలతో ఈ వేడుకలు ముగిశాయి.

గంటాను కలిసిన కోరాడ, గరే

ప్రజాశక్తి-ఆనందపురం, పిఎం.పాలెం : భీమిలి అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి గంటా శ్రీనివాసరావును టిడిపి యువ నాయకుడు, వేములవలస పంచాయతీ ఉప సర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ గురువారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. భీమిలిలో గంటా గెలుపునకు డోకా లేదని ఆయన అన్నారు. 2014లో కంటే ఈసారి భారీ ఓట్లు సాధించి భీమిలి ఎమ్మెల్యేగా గెలుస్తారని తెలిపారు.

పిఎం.పాలెం : భీమిలి నియోజకవర్గం కూటమి అభ్యర్థి గంటా శ్రీనివాసరావును గురువారం తెలుగు యువత ఉపాధ్యక్షులు, కెవిఆర్ క్యాటరింగ్స్ అధినేత గరే గురునాథ్, 6వ వార్డు బీసీ సెల్ అధ్యక్షులు రెడ్డి సత్యనారాయణతో సహ సుమారు 50 మంది మర్యాదపూర్వకంగా గంటా స్వగృహంలో కలిశారు. రాష్ట్రంలో రాబోయేది కూటమి ప్రభుత్వమేనని, భీమిలి నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీతో గెలుస్తానని గంటా ధీమా వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో పిల్ల రమేష్, దాసు, కొరుకూరి చిన్న, ముల్లు సూరిబాబు, బంక వెంకట అప్పారావు, పిల్ల వెంకట అప్పారావు, రాయన శివ, శాన్న బుజ్జి, మహిళలు గండిబోయిన లక్ష్మి, పద్మ, వి.లక్ష్మి, రుక్మిణి, స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

కొండవాలు ప్రాంతంలో కోతకు గురైన రహదారి



కోతకు గురైన కొండవాలు ప్రాంత రహదారి

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 9వ వార్డు పరిధి విశాలాక్షినగర్ కొండవాలు ప్రాంతంలో ప్రధాన రహదారి కోతకు గురైంది. ఈ రహదారిలో రాకపోకలు సాగించాలంటే కత్తిమీద సాములాగ తయారైంది. దీంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. విశాలాక్షినగర్ ప్రధాన రహదారి మీద ఉన్న పోలమాంబ అమ్మవారి గుడి ఎదురుగా కొండ మీదకు వెళ్లే పోలీసు బెటాలియన్ రహదారి చివరి ప్రాంతంలో రహదారి సగానికి పైగా కోతకు గురైంది. సుమారు 30 అడుగుల లోతు వరకు రహదారి కిందకు జారిపోవడంతో రాక పోకలకు సాగించాలంటే భయపడుతున్నారు. వాహనాలు రాకపోకలు సాగించినప్పుడు ఏమాత్రం అదుపు తప్పినా సుమారు 30 అడుగుల లోతులో ఉన్న నివాసాల మీద జారిపడే ప్రమాదం ఉంది. అదే రహదారి పక్కన పెద్ద పెద్ద అపార్టుమెంట్లు నిర్మాణాలు సాగిస్తున్నారు. నిర్మాణాలు పూర్తయ్యి నివాసాలు ఉంటే వాహనాలు రాకపోకలు ఎక్కువగానే ఉంటాయి. దీంతో రహదారి మరింత జారిపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా జివిఎంసి అధికారులు గుర్తించి రహదారి పక్కాగా నిలబడేందుకు దిట్టమైన రిటర్నింగ్ వాల్ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

గాయపడిన డ్రైవర్ మృతి

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక వలందపేటలో ఈ నెల 21 ఇంటి మేడపై నుంచి పడి తీవ్ర గాయాలపాలైన లారీ డ్రైవర్ చిల్ల అప్పలరాజు గురువారం మృతిచెందాడు. భీమిలి ఎస్ఐ జి.హరీష్ కథనం ప్రకారం.. లారీ డ్రైవర్ చిల్ల అప్పలరాజు (55) ఈ నెల 21న తప్ప తాగిన మైకంలో అతని ఇంటి మేడపై నుంచి ఉమ్మి వేస్తుండగా కింద పడిపోయాడు. అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. బంధువులు వెంటనే చికిత్స నిమిత్తం సంగివలసలోని అనిల్ నీరుకొండ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సలహా మేరకు విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో గురువారం మృతి చెందాడు. మృతుని కుమారుడు శ్రీను ఫిర్యాదు మేరకు ఎస్ఐ హరీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బోల్తాపడిన లారీ

ఎన్ఎడి వంతెనపై లారీ బోల్తా

ప్రజాశక్తి -గోపాలపట్నం : నగరంలో నుంచి గాజువాక వైపు పేపర్ బండిల్స్ లోడుతో వెళ్తున్న లారీ ఎన్ఎడి వంతెనపై రోటరీ డివైడర్ రైలింగ్‌ను ఢీ కొట్టి బోల్తా పడింది. ఈ ఘటనలో క్లీనర్ గాయాలతో బయటపడ్డాడు. ఎయిర్‌పోర్టు పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం... ఒడిశా బాలాసోర్ నుంచి విశాఖ ఆటోనగర్‌కు పేపర్ బండిల్స్‌లో లారీ వస్తోంది. ఎన్ఎడి ఫ్లైఓవర్‌పై గురువారం రాత్రి 2:30 గంటల సమయంలో బోల్తా పడింది. ప్రమాదంలో లారీ క్లీనర్ బిట్టు దాస్(20)కు స్వల్ప గాయాలయ్యాయి. డ్రైవరుకు ఎటువంటి ప్రమాదమూ జరగలేదు. కంచరపాలెం ట్రాఫిక్ సిఐ ప్రసాదరావు, ఎస్ఐ బాలరాజు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బోల్తా పడిన లారీలో ఉన్న పేపర్ బండిల్స్‌ను వేరే లారీలోకి ఎక్కించారు. లారీని పక్కకు తీసి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా క్రమబద్ధీకరించారు. లారీ డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్ సిఐ చక్రధరరావు నేతృత్వంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

స్వతంత్ర అభ్యర్థిపై దాడి కేసులో ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సార్వత్రిక ఎన్నికల్లో విశాఖపట్నం పార్లమెంట్ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన దేవర శంకర్‌పై జివిఎంసి 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ అనుచరులు దాడి చేసిన ఘటనకు సంబంధించి అందిన ఫిర్యాదుపై పోలీసులు స్పందించారు. కేసు నమోదు చేసి చినవాల్తేరుకు చెందిన భోగా రవిశంకర్, మంగాపురం కాలనీకి చెందిన జి.స్వామి, కె.రామకృష్ణలను గురువారం అరెస్టు చేశారు. స్థానిక కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ చేస్తున్న అక్రమ కార్యకలాపాలను సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించినందుకు దేవర శంకర్‌పై వారంతా దాడికి పాల్పడినట్టు తెలుస్తోంది.

ప్రభుత్వ మద్యం దుకాణంలో షార్ట్ సర్క్యూట్

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక పంతులు గారు మేడ వద్ద ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణంలో గురువారం షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో కంప్యూటర్‌తో పాటు, కొన్ని మద్యం సీసాలు కాలి బూడిదయ్యాయి. రెండు లక్షల రూపాయలు నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేశారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు రెండు కేంద్రాలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఈ నెల 24 నుంచి జూన్ 3వ తేదీ వరకు జరుగు టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు స్థానికంగా రెండు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంఇఒ ఎం.శివరాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో పరీక్షలు జరగనున్నట్లు పేర్కొన్నారు. ఆయా పరీక్షా కేంద్రాల్లో 240 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష ఉంటుందని వివరించారు. పరీక్షా కేంద్రానికి ఉదయం 8.30 గంటలకు హాజరవ్వాలని విద్యార్థులకు సూచించారు.

అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్డుకు మహర్దశ

ప్రజాశక్తి-సీతమ్మధార : అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డుకు మహర్దశ పట్టింది. రహదారి విస్తీర్ణంలో దశాబ్దాలుగా పడుతున్న ఇబ్బందులు తొలిగాయని స్థానికులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. జాతీయ రహదారి నుంచి నగరంలోకి ప్రవేశించే ప్రధాన మార్గాల్లో ఒకటైన అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డు ఇరువైపులా ఆక్రమణలతో ఇరుగ్గా ఉండటంతో తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తేవి. ఈ మార్గంలో ప్రయాణించడానికి వాహనచోదకులు అవస్థలు పడేవారు. దశాబ్దాలుగా ఇబ్బంది పడుతున్నా ప్రభుత్వాలు ఏనాడూ పట్టించుకోలేదు. వైసిపి ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి చొరవతో 2004 మాస్టర్ ప్లాన్ ప్రకారం మెయిన్ రోడ్డు విస్తీర్ణం చేపట్టారు. రహదారి విస్తరణ కోసం ప్రభుత్వం రూ.11 కోట్లు మంజూరు చేసింది. మహారాణి పార్లర్ కూడలి విస్తీర్ణం, బ్యూటీఫికేషన్ కోసం మరో రూ.96 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో జాతీయ రహదారి నుంచి మహారాణి పార్లర్ వరకు 80 అడుగులుగా, పార్లర్ నుంచి దొండపర్తి కూడలి వరకు 60 అడుగుల రోడ్డుగా విస్తరించారు. దీంతో అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డు రూపురేఖలు మారిపోయాయి. విశాలమైన రహదారి మధ్యలో సెంటర్ మీడియన్, దానిపై విద్యుత్ దీపాలు, మహారాణి పార్లర్ కూడలిలో ఆకర్షణీయంగా వాటర్ ఫౌంటైన్ నిర్మించారు. అక్కయ్యపాలెం ప్రధాన రహదారి విస్తీర్ణం దాదాపు పూర్తయింది. మహారాణి పార్లర్ నుంచి హైవే వరకు ఉన్న రహదారిని 80 అడుగులుగా విస్తరించారు. ఈ మార్గంలో రోడ్డుకిరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించి సిడబ్ల్యు డ్రెయిన్లు, దానిపై పాదచారులు నడవడానికి వీలుగా ఫుట్‌పాత్‌లు నిర్మించారు. రోడ్డు మధ్యలో సెంటర్ మీడియన్ నిర్మించి, దానిపై విద్యుత్ స్తంభాలు ఏర్పాటుచేశారు. మహారాణి పార్లర్ జంక్షన్ నుంచి దొండపర్తి కూడలి వరకు 60 రోడ్డుగా విస్తరించి ఫుట్‌పాత్‌లను నిర్మించారు. రహదారి విస్తీర్ణంతో చాలావరకు ట్రాఫిక్ సమస్యలు తీరాయని స్థానికులు, వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



విస్తరణతో విశాలంగా ఉన్న అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డు

ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం

హైవే నుంచి దొండపర్తి వెళ్లడానికి ట్రాఫిక్ సమస్యలతో చాలా ఇబ్బందులు పడే వారం. వ్యాపార ప్రాంతం కావడంతో ఈ మార్గం నిత్యం రద్దీగా, ఇరుగ్గా ఉండేది. ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పుకునే వీలు లేక తరచూ ట్రాఫిక్ జామ్ అయ్యేది. సాయంత్రం వేళలో ట్రాఫిక్ సమస్య మరింత అధికంగా ఉండేది. రహదారి విస్తరణతో ట్రాఫిక్ సమస్యలన్నీ పరిష్కారమయ్యాయి. వ్యాపారాలు చేసుకునేందుకు అనువుగా ఉంది.

రమణ
అక్కయ్యపాలెం వాసి

ఫుట్‌పాత్‌తో తొలగిన కష్టాలు

రహదారి నిత్యం రద్దీగా ఉండేది. ఏ వాహనం ఎటు నుంచి వచ్చి ఢీకొంటుందో తెలియని పరిస్థితి కనిపించేది. మహిళలు, వృద్ధులు నడవటానికి భయపడేవారు. విస్తరణ పనులతో రోడ్డుకిరువైపులా పాదచారులు నడవటానికి ఫుట్‌పాత్‌లను నిర్మించడం వల్ల సౌకర్యంగా ఉంది.

గౌరీ శంకర్,
లలిత నగర్ వాసి,

సులువుగా ప్రయాణం

అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డు విస్తరణ ద్వారా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా విధులు నిర్వహిస్తున్నాం. సాయంత్రం వేళలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉన్నందున వాహనదారులు చాలా ఇబ్బందులు ఎదుర్కొనే వారు. రోడ్డును విస్తరించడం వల్ల ఇబ్బందులు తొలగాయి. ఫుట్‌పాత్‌ల నిర్మాణం వల్ల వృద్ధులు, వికలాంగులు సులువుగా ప్రయాణం చేయగలుగుతున్నారు.

వాణిశ్రీ, ఎస్ఐ
నాలుగో పట్టణ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్


మట్టి తవ్వకాలను పరిశీలిస్తున్న మైనింగ్, రెవెన్యూ అధికారులు

మట్టి దందాపై పరిశీలన

'ప్రజాశక్తి' కథనానికి స్పందించిన అధికారులు

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలంలోని భీమన్న దొరపాలెం పంచాయతీ కోలవానిపాలెం, పప్పులవానిపాలెం చెరువు, పొలాలలో 'యథేచ్ఛగా మట్టి దందా!' శీర్షికన ప్రజాశక్తిలో గురువారం ప్రచురితమైన కథనానికి రెవెన్యూ, మైనింగ్ అధికారులు స్పందించారు. మైనింగ్ డిపార్ట్‌మెంటు ఆర్ఐ సిహెచ్. ఆంజనేయులు ఆధ్వర్యాన టెక్నికల్ అసిస్టెంట్ శైలజ సుభాని, స్థానిక విఆర్ఓ ప్రియానంద్ సంఘటనా స్థలానికి చేరుకుని మట్టి ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిశీలించారు. మట్టిని రెండు రోజుల నుంచి రెండు జెసిబిలు తవ్వి, లారీలతో రవాణా చేసి ఇటుక బట్టీలకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. సుమారు 250 క్యూబిక్ మీటర్ల మట్టిని తీసుకెళ్లినట్లు గుర్తించి స్థానిక రెవెన్యూ అధికారులకు రిపోర్ట్ అందిస్తామ మైనింగ్ ఆర్ఐ ఆంజనేయులు తెలిపారు.



విరమణ పొందనున్న ఉద్యోగులను సన్మానిస్తున్న కాంట్రాక్టర్లు

ఉద్యోగ విరమణ సన్మానం

ప్రజాశక్తి -ములగాడ : హెచ్‌పిసిఎల్ ఈడీ రత్నరాజు, ప్రాజెక్ట్ ఈడీ వీరభద్రరావు, హెచ్ఆర్ చీఫ్ మేనేజర్ జాన్ చర్యన్ ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేయనున్న సందర్భంగా కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన గురువారం హెచ్‌పిసిఎల్ విశాఖ రిఫైనరీలో సన్మానించారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ అసోసియేషన్ అధ్యక్షులు మజ్జి సోమేష్, ప్రధాన కార్యదర్శి రవికుమార్, ములంపాక అప్పారావు, బోగవిల్లి నాగేశ్వరరావు, శ్రీకాంత్, కాకి పోలిరెడ్డి, విజయ్ కుమార్, సత్యాల మహేష్, నాగోతి శ్రీను, బంక శ్రీను, కార్యవర్గ సభ్యులు రవిశంకర్, దయానంద్, బోగవిల్లి కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

జీవవైవిధ్య పరిరక్షణతో ఆహార భద్రత

ప్రజాశక్తి-విశాఖపట్నం : జీవ వైవిధ్య పరిరక్షణతో ఆహార భద్రత సాధ్యపడుతుందని డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చరల్ యూనివర్సిటీ వీసీ ఆచార్య టి.జానకిరామ్ అన్నారు. అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏయూ వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యాన గురువారం నిర్వహించిన ఒకరోజు జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జానకిరామ్ మాట్లాడుతూ, అటవీ సంపద తగ్గిపోవడం, గ్రీన్ హౌస్ గ్యాస్‌ల ఉద్గారాలు పెరిగిపోవడం ముప్పునకు కారణంగా మారుతున్నాయన్నారు. పర్యావరణ పరిరక్షణకు సంఘటితంగా, ప్రణాళికాబద్ధంగా పనిచేయాల్సిన అవశ్యకతను వివరించారు.

ఏయూ వీసీ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి మాట్లాడుతూ, జీవ సమతుల్యత దెబ్బతినకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రకృతి ప్రేమికులుగా ప్రతి వ్యక్తీ మారాల్సిన అవసరం ఉందన్నారు. కర్బన ఉద్గారాలు పెరిగిపోవడం సముద్ర ప్రాణులపైన కూడా ప్రభావం చూపుతున్నాయన్నారు. నేషనల్ బయోడైవర్సిటీ బోర్డు సభ్యులు ఆచార్య హంచిలాల్ మాట్లాడుతూ, ఉష్ణోగ్రతల్లో ఒక్క డిగ్రీ పెరుగుదల వ్యవసాయ రంగాన్ని ఎంతో ప్రభావితం చేస్తుందన్నారు. ఆర్కిటిక్, అంటార్కిటిక్ ప్రాంతాలపై ఉష్ణోగ్రతల ప్రభావం, పర్యవసానాలను వివరించారు. ఏపి బయో డైవర్సిటీ బోర్డ్ మెంబర్ సెక్రటరీ బివిఎ.కృష్ణమూర్తి మాట్లాడుతూ, క్లైమేట్ చేంజ్ ప్రభావంగా జీడీపీ దెబ్బతింటుందన్నారు. పర్యాటకం పేరుతో జీవ వైవిధ్యం దెబ్బతినకుండా చూడాలన్నారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, విభాగాధిపతి ఆచార్య కె.సంధ్య దీపిక ప్రసంగించారు.

బిసిజి టీకాలను వినియోగించుకోవాలి


బిసిజి టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి-మధురవాడ : మధురవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో అన్ని సచివాలయాల్లో క్షయ వ్యాధి నివారణ కోసం వేస్తున్న బిసిజి టీకాలను అందరూ వినియోగించుకోవాలని పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ప్రశాంతి కోరారు. పిహెచ్‌సి పరిధిలోని పలు కేంద్రాలు గురువారం బిసిటి టీకాలు వేసే కార్యక్రమాన్ని చేపట్టారు. టీకాలు వేస్తున్న పలు కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఐదేళ్ల క్రితం టీబీ వచ్చిన తగ్గిపోయిన వారు, 18 ఏళ్లు నిండిన వారు, పొగ తాగేవారు, సుగర్ వ్యాధి గ్రస్తులు, బాడీ మాస్ ఇండెక్స్ 18 కన్నా తక్కువ ఉన్నవారు, టీబీ రోగులతో దగ్గరి సంబంధం ఉన్న వారు బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మధురవాడ టీబీ యూనిట్ సీనియర్ ల్యాబ్ సూపర్‌వైజర్ వి.వీరబ్రహ్మం పాల్గొన్నారు.

'శ్రీవిద్యా' పాఠశాల గుర్తింపు రద్దు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాకలోని శ్రీ విద్యా ఇంగ్లీష్ మీడియం పాఠశాల గుర్తింపు రద్దుచేసినట్లు గాజువాక మండల విద్యాశాఖాధికారులు ఎం.సునీత, విశ్వనాథం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భవనం లీజ్ డీడ్ 2023-24 విద్యా సంవత్సరంతో ముగిసినప్పటికి పాఠశాల యాజమాన్యం రెన్యువల్ చేసుకోలేని కారణంగా పాఠశాలకు ప్రభుత్వ గుర్తింపును రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గుర్తింపు రద్దు చేస్తున్నట్లు పాఠశాల యాజమాన్యానికి ముందుగానే తెలియజేసినట్లు తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ఆ పాఠశాలలో పిల్లలను ఎవ్వరూ చేర్పించ వద్దని తల్లిదండ్రులకు సూచించారు. గుర్తింపు లేని ఏ పాఠశాలలోనూ పిల్లలను చేర్పించవద్దని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.

మాజీ ఎంపీ అప్పలనరసింహానికి ఘన నివాళి

ప్రజాశక్తి -గోపాలపట్నం : మాజీ ఎంపీ కీర్తిశేషులు పెతకంశెట్టి అప్పల నరసింహం 17వ వర్ధంతినిఆయన తనయుడు స్థానిక ఎమ్మెల్యే గణబాబు ఆధ్వర్యాన ఆయన స్వగృహంలో నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీలో అప్పల నరసింహం అనేకమంది శిష్యులను తయారుచేశారని గుర్తు చేశారు. ఆయన బ్రతికున్నంత కాలం ప్రజా సేవలో తరించారన్నారు. ఆయన భౌతికంగా లేకపోయినా ఆయన జ్ఞాపకాలు కుటుంబ సభ్యులకు, పార్టీ నాయకులకు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మూర్తి యాదవ్, నార్ని సత్తిరాజు, మూర్తి, పట్నాయక్, జీన్స్ వేర్ రమేష్, నాయకులు పాల్గొన్నారు.


అప్పలనరసింహం చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

బర్మా క్యాంప్‌లో కార్డన్ సెర్చ్

ప్రజాశక్తి-సీతమ్మధార : ఎన్నికల కౌంటింగ్ సమీపిస్తుండటంతో నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ ఆదేశాల మేరకు నగరంలో పలు ప్రాంతాలలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. డిసిపి మేక సత్తిబాబు ఎసిపి అన్నెపు నరసింహమూర్తి ఆధ్వర్యాన బర్మా క్యాంప్ ఏరియాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. 14 బైకులు, 55 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అనుమానిత వ్యక్తులను విచారించారు.

ప్రభుత్వ స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలపై ఫిర్యాదు

ప్రజాశక్తి -పద్మనాభం : ప్రభుత్వ స్థలంలో ఇళ్ల నిర్మాణాలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పాండ్రంగి పంచాయతీ ఏనుగులపాలెం గ్రామానికి చెందిన వి.వరదేశి గురువారం తహశీల్దార్ కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన ఎస్.చిన్న, డి.శ్రీను తదితరులు ప్రభుత్వ భూమిలను ఆక్రమించి ఇళ్ల నిర్మాణాలు చేపట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ అక్రమ నిర్మాణాలు చేపట్టినప్పుడు రెవెన్యూ అధికారులు రెండుమూడు సార్లు తొలగించారని, ఇప్పుడు మళ్లీ వాటిని పూర్తిచేసుకున్నారని వివరించారు. గ్రామానికి చెందిన సర్వేనెంబర్ 317లో 25 సంవత్సరాలుగా పశువుల పాక వేసుకొని ఉన్నామని, ఆ స్థలంలో తాము ఇల్లు నిర్మాణానికి ఏర్పాట్లు చేసుకుంటే కొంతమంది నాయకులు, అధికారులు అడ్డంకులు కల్పిస్తున్నారని తెలిపారు. తమకు అనుమతి ఇచ్చి ఇల్లు నిర్మాణం చేపట్టేలా రెవెన్యూ అధికారుల సహకరించాలని కోరారు.

అన్నదానం

ప్రజాశక్తి-సీతమ్మధార : రైల్వే న్యూకాలనీలోని షిర్డీ సాయిబాబా ధ్యాన మందిరం ఆవరణలో గురువారం 400 మందికి ప్రత్యేకంగా అన్నదానం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం, ధనలక్ష్మి దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా ఆలయంలో సీతారాం దంపతులు షిర్డీ సాయిబాబాకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు నూకల శేషగిరి రావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

- జిల్లా ఎస్‌పి మురళీకృష్ణ
- ప్రజలకు అవగాహన కల్పించేందుకు 'మాబ్ ఆపరేషన్' మాక్ డ్రిల్

ప్రజాశక్తి-అనకాపల్లి

జూన్ 1వ తేదీన ఎగ్జిట్ పోల్స్, జూన్ 4వ తేదీన సార్వత్రిక ఎన్నికలు -2024 కౌంటింగ్ ఉన్న నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా అల్లర్లు, గొడవలు సృష్టించే వ్యక్తుల పట్ల చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్‌పి కెవి.మురళీకృష్ణ హెచ్చరించారు. శాంతిభద్రతలను పరిరక్షించటమే ధ్యేయంగా జిల్లా ఎస్పీ మురళీకృష్ణ సమక్షంలో, డీఎస్పీ పి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆర్మ్డ్ రిజర్వు, లా అండ్ ఆర్డర్ పోలీస్ సిబ్బందితో అనకాపల్లి పట్టణంలోని నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద గురువారం మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్ నిర్వహించారు. ఏదైనా అవాంఛనీయ సంఘటనలు పోలీసుల దృష్టికి వచ్చినప్పుడు, 144 సెక్షన్ అమల్లో ఉన్న సందర్భంలో, ప్రజల శాంతి భద్రతల దృష్ట్యా పోలీసులు స్పందించాల్సిన తీరుపై మాక్ డ్రిల్ నిర్వహించారు. అక్రమ జన సమూహాలను కంట్రోల్ చేయడానికి మొదటగా వార్నింగ్ ఇచ్చుట, అది వినకపోతే మెజిస్ట్రేట్ అనుమతితో టియర్ గ్యాస్ ప్రయోగించుట, ఉద్రిక్త పరిస్థితుల్లో తనను తాను రక్షించుకుంటూ లాఠీఛార్జ్, ఆ తర్వాత ఫైర్ డిపార్ట్మెంట్ వారితో వాటర్ కెనాన్ ప్రయోగించుట, ప్లాస్టిక్ పెల్లెట్స్ ఫైరింగ్, అప్పటికి పరిస్థితి అదుపులోకి రాని ఎడల ఫైరింగ్ చేయుట వంటివి ఈ మాక్ డ్రిల్లో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ అల్లరి మూకలను అణచి వేసేందుకు, అత్యవసర సమయంలో పరిస్థితిని అదుపులోకి తీసుకొని వచ్చేలా ప్రత్యేక టీములు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఫైర్ సర్వీస్ అధికారి నర్సింగరావు, సిబ్బందిని ఈ సందర్భంగా ఎస్‌పి అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, డిఎస్‌పిలు పి.నాగేశ్వరరావు, ఎస్.అప్పలరాజు, కెవి.సత్యనారాయణ, జిఆర్ఆర్.మోహన్, అప్పారావు, ఎం.ఉపేంద్రబాబు, ట్రైనీ డీఎస్పీ భవ్య, ఇన్‌స్పెక్టర్లు మన్మధరావు, సతీష్, శంకరరావు, శ్రీనివాసరావు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాక్ డ్రిల్‌లో పాల్గొన్న ఎస్‌పి, ఎఎస్‌పి, డిఎస్‌పిలు, పోలీసు బలగాలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-కె.కోటపాడు

అనకాపల్లి జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో, విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి, వాసవి క్లబ్ ఆధ్వర్యంలో కె.కోటపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద గురువారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 85 మంది కంటి రోగులను పరీక్షలు చేయగా 35 మందికి కంటి ఆపరేషన్ ఎంపిక చేసి శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి తరలించారు. కంటి నరాలు చికిత్స కోసం, కంటి పై పొర చికిత్స కోసం, కంటి నీటి కాసుల చికిత్స కోసం, కంటి రెప్పల చికిత్స కోసం, చిన్నపిల్లల కంటి చికిత్స కోసం పలువురిని ఈ శిబిరం ద్వారా రెఫెర్ చేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షులు విన్నకోట ఆనందరావు, కార్యదర్శి కోట్ల రాంబాబు, కోశాధికారి మామిడి రమణాజీ, శంకర్ ఫౌండేషన్ డాక్టర్ మధులిక, ఆప్తలమిక్ ఆఫీసర్ హరి చందన, శంకర్ ఫౌండేషన్ క్యాంపు కో ఆడినేటర్ సిహెచ్ అశ్వని కుమార్, నర్సింగ్ స్టాఫ్ దీపిక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఖరీఫ్ వరి సాగుకు సన్నద్ధం

- వరి, పచ్చిరొట్ట విత్తనాలు సరఫరాకు ఏర్పాట్లు
- వ్యవసాయ శాఖ ఎఒ మోహనరావు

ప్రజాశక్తి - యలమంచిలి



మాట్లాడుతున్న మోహనరావు

మండలంలో ఖరీఫ్ వరి పంటకు రైతులు తమ భూముల్ని సిద్ధం చేస్తున్నారని మండల వ్యవసాయాధికారి పొలిమేర మోహనరావు తెలిపారు. యలమంచిలిలోని తన కార్యాలయంలో గురువారం మోహనరావు విలేకర్లతో మాట్లాడుతూ మండలంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో సుమారు 4000 ఎకరాల్లో వరి సాగు జరుగుతుందని చెప్పారు. వర్షాలు కూడా తగు మోతాదులో కురిసే అవకాశం ఉందని, ఆశాజనక సానుకూల వాతావరణం ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారని పేర్కొన్నారు. రైతులకు అవసరమైన వరి విత్తనాలు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. వరి రకాలు ఆర్జీఎల్ 2537, కొత్తరకం ఎంటియు 1318, ఎంటియు 1061, 1064, 1224. 7026 రకాలు సబ్సిడీపై రైతు భరోసా కేంద్రాల్లో పొందవచ్చునని తెలిపారు. పచ్చి రొట్ట విత్తనాలు కూడా 50శాతం రాయితీతో సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. రైతులు ముందుగా ఆధార్, పాస్‌పుస్తకం వివరాలు రైతు భరోసా కేంద్రంలో నమోదు చేసుకోవాలన్నారు. భూమి సారవంతం కావడానికి, దిగుబడి పెరగడానికి పచ్చిరొట్ట ఎరువులు బాగా తోడ్పడతాయని పేర్కొన్నారు. పచ్చిరొట్ట వల్ల రసాయన ఎరువులు వాడే అవసరం తగ్గుతుందని సూచించారు. పచ్చిరొట్ట ఎరువు మూలంగా పురుగులు, తెగుళ్ల ఉధృతి ఉండదని పేర్కొన్నారు.

ఓట్ల లెక్కింపు నిబద్ధతతో, నిర్భయంగా చేయాలి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

ప్రజాశక్తి -అనకాపల్లి

జూన్ 4వ తేదీన నిర్వహించే ఓట్ల లెక్కింపు నిబద్ధతతో, నిర్భయంగా చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు రవి పట్టన్ శెట్టి ఆదేశించారు. మాస్టర్ ట్రైనీలకు ఈవీఎంలు, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుపై కలెక్టరు కార్యాలయంలో గురువారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. శిక్షణలో ప్రతి చిన్న విషయాన్నీ క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. మాన్యువల్‌లో సూచించిన ప్రకారం ఓటు చెల్లుబాటును గుర్తించ వలసి వుంటుందని చెప్పారు. ముందుగా ఈవీయంను పరిశీలించి పోలైన ఓట్లను సరిచూడాలని, తరువాత సాంకేతిక పరమైన అంశాలను సరిచూసి ఆపై లెక్కింపుకు వెళ్లాలని సూచించారు. ఎటువంటి తడబాటుకు అవకాశం ఇవ్వరాదన్నారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు, ఈవీఎంల లెక్కింపు పైన కూడా అందరికీ పూర్తి శిక్షణ ఇవ్వాలన్నారు. శిక్షకులు చెప్పిన విషయాలను క్షుణ్ణంగా ఆకలింపు చేసుకోవాలని కోరారు. చిన్న పొరపాటుకు కూడా అవకాశమియ్యరాదన్నారు. నియమ నిబంధనలను పూర్తిగా అర్థం చేసుకోవాలని ఆదేశించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి, సిపిఒ జి.రామారావు, నర్సీపట్నం ఆర్డీవో హెచ్‌వి.జయరామ్, సివిల్ సప్లైస్ డియం పి.జయంతి, డిఎల్‌డిఒ నాగలక్ష్మి, డిఎల్‌పివో కుమార్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ డి.రామ్మూర్తి, డిటి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

యుబిఐ ఆధ్వర్యాన మెగా రిటైల్ ఎక్స్‌పోర్ట్

ప్రజాశక్తి-అనకాపల్లి

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విజయనగరం ప్రాంతీయ కార్యాలయం వారి ఆధ్వర్యాన అనకాపల్లిలో గురువారం మెగా రిటైల్ ఎక్స్‌పోర్ట్ -2024 కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథులుగా నరేష్, డిప్యూటీ జోనల్ హెడ్ శంకర్ హేమ్ రామ్, డిప్యూటీ రీజినల్ హెడ్ ప్రసాద్, ఎల్‌డిఎం సత్యనారాయణ, అనకాపల్లి జిల్లాలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెూమ్ లోన్, ఎడ్యుకేషన్, వెహికల్ లోన్, పర్సనల్ లోన్ అన్ని విభాగాల్లో 32.35 కోట్ల రూపాయలు మంజూరు చేయబడింది. సంబంధిత లెటర్స్ కస్టమర్లకు ఇవ్వడం జరిగింది. డిప్యూటీ జోనల్ హెడ్ కుక్కర్ మాట్లాడుతూ యూనియన్ బ్యాంక్ వివిధ సేవలను మెరుగుపరిచిందని, కస్టమర్లు దానిని సద్వినియోగపరుచుకోవాలని సూచించారు.

గురుకులాల్లో స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్ వాయిదా

ప్రజాశక్తి- సబ్బవరం

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల/కళాశాలల్లో ప్రవేశానికి ఈ నెల 24న జరగవలసిన స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్ వాయిదా వేసినట్లు సబ్బవరం గురుకుల కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్‌వివి.సత్యారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మేఘాద్రిగెడ్డలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులంలో ఈ నెల 24న ఐదో తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో మిగిలిన సీట్ల భర్తీకి ఈ స్పాట్ కౌన్సెలింగ్ ఏర్పాటు చేయగా, అనివార్య కారణాలవల్ల ఈ స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్‌ను వాయిదా వేసినట్లు తెలిపారు. త్వరలో కౌన్సెలింగ్ తేదీని ప్రకటిస్తామన్నారు.

బీసీల ఐక్యతకు కృషి

ప్రజాశక్తి -అనకాపల్లి

రాష్ట్రంలో బీసీల ఐక్యతకు అంతా కృషి చేయాల్సిన అవసరం ఉందని సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి బంధం పైడిరాజు అన్నారు. అనకాపల్లి పట్టణంలోని విజయ రెసిడెన్సీలో సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఆళ్ళ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం సంఘం 10వ వార్షికోత్సవం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన పైడిరాజు కేక్ కట్ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు చింతకాయల కొర్లయ్య, బండారు సోమినాయుడు, వేగి త్రినాధ్, సిహెచ్.రాజు, కొల్లి నాయుడు, జయ, లీల, లక్ష్మి, రాజాన రాజు, నూకరాజు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

40 ఎకరాల ప్రభుత్వ భూమిపై కన్ను

కాజేయడానికి రాజకీయ నాయకులు, ఆర్మీ ఉద్యోగుల ప్రయత్నాలు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

మండలంలోని రాజాం సర్వే నెంబర్ 233లో ఊరకొండను ఆనుకొని సుమారు 40 ఎకరాల ప్రభుత్వ భూమిని కాజేయడానికి ముమ్మర ప్రయత్నాలు సాగుతున్నాయి. ఈ 40 ఎకరాల భూమి రాజాం, ఖైపురం, చిట్టియ్యపాలెం, తురకలపూడి తదితర గ్రామాలను ఆనుకొని ఉంది. ఈ భూమి తమకు కావాలంటే, తమకు కావాలని 10 సంవత్సరాల నుండి ఆయా గ్రామాలకు చెందినవారు ఘర్షణ పడుతున్నారు. ఏడాది క్రితం సదరు భూముల్లోని యూకలిప్టస్ తోటల కోసం రాజాం, చిట్టియ్యపాలెం గ్రామాలకు చెందిన వారు సైతం ఘర్షణ పడ్డారు. ఈ భూములు అనకాపల్లి -తట్టబంద మార్గంలో రోడ్డు పక్కనే ఉండడంతో పాటు, ఒక్కో ఎకరా రూ.50లక్షల నుండి రూ.60లక్షలకు పైగా ధర పలుకుతోంది. దీంతో ఇప్పుడు ఈ భూములను దక్కించుకోవడానికి కొంతమంది ఆర్మీ ఉద్యోగులు, కొంతమంది స్థానిక ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు ప్రయత్నాలు ప్రారంభించారు. ఇందులో భాగంగా దిగువ స్థాయి రెవెన్యూ సిబ్బందితో సర్వేలు కూడా చేయించినట్లు సమాచారం. ఈ భూమిని కాజేయడానికి కొంత మంది దానిని చదును కూడా చేయించారు. అయితే ఆయా గ్రామాల్లోని భూమి లేని నిరుపేదలకు దక్కాల్సిన ఈ భూమిని పెద్దలు కొట్టేయడానికి చూస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సదరు ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని, నిజంగా భూమి లేని పేదలకు ఆ భూమిని పంపిణీ చేయాలని పలువురు కోరుతున్నారు.



ప్రభుత్వ స్థలాన్ని చదును చేసిన దృశ్యం

టిడిపి నాయకులు రమేష్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- కశింకోట

తెలుగుదేశం పార్టీ తాళ్ళపాలెం గ్రామ కమిటీ అధ్యక్షులు ఉల్లింగల రమేష్ జన్మదిన వేడుకలు మండలంలోని చింతలపాలెం సాయిబాబా ఆలయం వద్ద గురువారం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందా సత్యనారాయణ కేక్ కట్ చేసి రమేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి గొంతిని శ్రీనివాసరావు, ఉగ్గిని రమణమూర్తి, వేగి గోపికృష్ణ, కలగా సోమేశ్వరరావు, నైనంశెట్టి రమణరావు, బుదిరెడ్డి గంగయ్య, సిదిరెడ్డి శ్రీను, జెర్రిపోతుల నూకి నాయుడు, పప్పల గోవింద తదితరులు పాల్గొన్నారు.



రమేష్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే పీలా తదితరులు

ప్రశాంతంగా ఓట్ల లెక్కింపునకు సహకరించాలి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్ శెట్టి

ప్రజాశక్తి- అనకాపల్లి

జూన్ 4వ తేదీన అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు సజావుగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు రాజకీయ పార్టీల అభ్యర్థులు, ఏజెంట్లు పూర్తి సహాయ సహకారాలను అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టరు రవి పట్టన్‌శెట్టి కోరారు. అనకాపల్లి పార్లమెంటు, జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీలో వున్న అభ్యర్థులు, వారి ఏజెంట్లతో గురువారం కలెక్టరు కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ఫ్యూచర్ వరల్డ్ స్కూల్లో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పార్లమెంటు నియోజకవర్గంలో భాగమైన పెందుర్తి నియోజకవర్గం ఓట్ల లెక్కింపు విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీలో జరుగుతుందన్నారు. కౌంటింగ్ హాల్ లోనికి ప్రవేశం, అసెంబ్లీ, పార్లమెంట్ టేబుళ్ల అమరిక మొదలైనవి అభ్యర్థులు, ఏజెంట్లు ముందుగా పరిశీలించుకోవచ్చని తెలిపారు. నిర్ధీత సమయాల్లో వారు వచ్చి ఏర్పాట్లును, రాక, పోకలను గూర్చి తెలుసుకోవచ్చని చెప్పారు. కౌంటింగ్‌కు హాజరయ్యే ఏజెంట్లు తప్పని సరిగా పాస్‌లు తీసుకోవాలన్నారు. సెల్ ఫోన్‌లను కౌంటింగ్ కేంద్రంలోకి తీసుకెళ్లరాదని స్పష్టం చేశారు. జిల్లా ఎస్‌పి కెవి.మురళీకృష్ణ మాట్లాడుతూ మన జిల్లాలో పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని, కౌంటింగ్ ప్రక్రియ కూడా ప్రశాంతంగా జరిగేందుకు అన్ని పార్టీల వారు సహకరించాలని కోరారు. ఎటువంటి ఘర్షణలకు, హింసకు తావివ్వకుండా, ఇతరుల భావోద్వేగాలను ప్రేరేపించకుండా చట్టాలను గౌరవించాలని సూచించారు. జూన్ 1 నుండి టీవీలలో ఎగ్జిట్ పోల్స్ ప్రసారమవుతాయని, ఆ రోజు నుండి శాంతి భద్రతల పర్యవేక్షణకు ఫ్లాగ్ మార్చ్‌లు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద త్రిటైర్ భద్రత వుంటుందన్నారు. పికెట్లు, చెక్ పోస్టులు మరింత కట్టుదిట్టం చేస్తామన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, డిఆర్‌ఒ బి.దయానిధి, ఆర్డీవోలు ఎ.చిన్నికృష్ణ, హెచ్‌వి.జయరామ్, ఆర్‌వోలు మనోరమ, గీతాంజలి, సత్యవాణి, అనకాపల్లి పార్లమెంటు, జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులు, వారి ఏజెంట్లు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్‌పి మురళీకృష్ణ, అభ్యర్థులు, ఏజెంట్లు



పెతకంశెట్టి విగ్రహానికి నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

పెతకంశెట్టికి ఘన నివాళి

ప్రజాశక్తి -మునగపాక

పార్లమెంట్ మాజీ సభ్యులు పెతకంశెట్టి అప్పలనరసింహం వర్ధంతి కార్యక్రమం మండలంలోని నాగులాపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించారు. పెతకంశెట్టి విగ్రహానికి టిడిపి బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మళ్ల సురేంద్ర స్థానిక నాయకులతో కలిసి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించినప్పుడు విశాఖ ఉమ్మడి జిల్లాలో ఎన్టీఆర్ వెంట నడిచిన వ్యక్తి అప్పలనరసింహం అని తెలిపారు. సమితి అధ్యక్షులుగా, వుడా చైర్మన్‌గా, పార్లమెంట్ సభ్యులుగా ప్రజలకు ఎన్నో సేవలందించారన్నారు. సీనియర్ నాయకులు పెతకంశెట్టి రాజునాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మళ్ల ఉమామహేశ్వరరావు, యల్లపు వెంకట, భాస్కరరావు, వేగి సోమేశ్వరరావు, దాడి ముసిలినాయుడు, పొలమరశెట్టి నాగు, దొడ్డి శివ, పొలమరశెట్టి నూకాలయ్య, మొల్లేటి సత్యనారాయణ, గుల్లేపల్లి సత్తిబాబు, శరగడం సత్యనారాయణ, మోరా రమేష్, కేశెట్టి కోటి, గోవాడ వెంకట అప్పారావు, గోసాల గోవింద, మన్యధరావు, బొడ్డేడ అచ్చియ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మరిడిమాంబ అమ్మవారి పండగ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

మండలంలోని ఐతంపూడి గ్రామంలో మరిడిమాంబ అమ్మవారి పండుగను గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండే అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. ఉజడి బల్లను గ్రామంలో ఊరేగింపు చేశారు. అనంతరం పోతురాజు బాబును ఊరేగింపు చేశారు. ఉదయం నుండి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శివాలయంలో 108 కుటుంబాలు పూజలు

ప్రజాశక్తి - కశింకోట

మండల కేంద్రం కశింకోట శివాలయంలో 108 మంది కుటుంబాలకు చెందిన భార్యాభర్తలు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుండి ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- మునగపాక

మండల కేంద్రం మునగపాక గ్రామానికి చెందిన ఆడారి తాతినాయుడు (మెకానిక్) ఇటీవల అకాల మరణం చెందడంతో స్పందించిన స్థానిక "తంపర మూల" సంఘం యువకులు, పెద్దలు తాతి నాయుడు కుటుంబ సభ్యులకు గురువారం రూ.35,700 ఆర్థిక సహాయం అందజేశారు. తాతినాయుడు గ్రామంలో నలుగురితో కలిసి మెలిసి అన్యోన్యతగా ఉండేవాడని, అతని మరణం జీర్ణించుకోలేకపోతున్నామని మిత్రులు వాపోయారు. తాతినాయుడు సోదరులు ఇద్దరూ ఈసరికే మరణించడంతో కుటుంబానికి అతనే చేదోడు వాదోడుగా ఉండేవాడని అతను కూడా మరణించడంతో కుటుంబం పెద్దదిక్కు కోల్పోవడం తమను తీవ్రంగా కలచివేసిందని మిత్రులు తమ బాధని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పెంటకోట ఆది శివ, పెంటకోట శివ గణేష్, కోయిలాడ రాము, శరగడం జగన్ పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

ప్రజల సమస్యలను పరిష్కరించండి

మండల పరిషత్తు సమావేశంలో ఎంపిపి కలగా లక్ష్మి

ప్రజాశక్తి-కశింకోట

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కశింకోట ఎంపీపీ కలగా లక్ష్మి గున్నయ్యనాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్తు సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి కలగా లక్ష్మి గున్నయ్యనాయుడు అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా చరకాము సర్పంచ్ వెన్నల చిన దేముళ్ల మాట్లాడుతూ గ్రామంలో మంచి నీటి సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. జె.తుని సర్పంచ్ కోన అరుణ మాట్లాడుతూ మేము పనులు చేసిన వాటికి బిల్లు మంజూరు చేయాలని కోరారు. దీనికి స్పందించిన ఎంపీపీ బిల్లులు తక్షణమే మంజూరయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. సిఐ వినోద్ బాబు మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు వచ్చే వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని, గ్రామాల్లో సభలు, సమావేశాలు నిర్వహిస్తే ఎన్నికల అధికారి నుండి అనుమతి తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అనకాపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, వైస్ ఎంపిపిలు పెంటకోట జ్యోతి శ్రీనివాసరావు, నమ్మి మీనా గణేష్, ఎంపీడీఓ శేషుబాబు, ఎంఇఓ చిట్టిబాబు, సిడిపిఓ ప్రభావతి, హౌసింగ్ ఏఇ శ్రీనివాసరావు, సర్పంచ్‌లు నిమ్మదల సోమేశ్వరరావు, కరణం శ్యాంసన్, పలువురు ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి కలగా లక్ష్మి

విద్యుత్ కోతలతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు

ప్రజాశక్తి-అనకాపల్లి

అప్రకటిత విద్యుత్ కోతలతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు పాత్రపల్లి వీరు యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. అనకాపల్లి ఉడ్‌పేటలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోజు రోజుకీ ఉష్ణోగ్రతలు పెరిగిపోయి 38, 40 డిగ్రీల కొనసాగుతున్నాయని, ప్రజలు ఎండ వేడిమికి తట్టుకోలేక ఎన్ని పనులు ఉన్నా రోడ్లపై రాకుండా ఇళ్ల దగ్గరే ఉంటున్నారని తెలిపారు. అనకాపల్లిలో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉందని, దీంతో పట్టణంలో తీవ్రంగా దోమలు పెరిగిపోయి ప్రజలు కంటిమీద కునుకు లేకుండా పోతుందని వాపోయారు. ఇటువంటి పరిస్థితుల్లో పగలు, రాత్రి తేడా లేకుండా విద్యుత్ కోతలు విధించడంతో ఉక్కపోతకు, దోమల ధాటికి తట్టుకోలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు, జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని విద్యుత్ కోతలు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో కోరుకొండ నాగరాజు, ముక్కా గణేష్, కరణం శివ తదితరులు పాల్గొన్నారు.

బుద్ధుని బోధనలు అనుసరణీయం

ప్రజాశక్తి -గాజువాక

మానవాళి మనుగడకు బుద్ధుని బోధనలు ఎంతో అవసరమని 72వ వార్డు కార్పొరేటర్ ఎజె స్టాలిన్ అన్నారు. చైతన్యనగర్‌లోని గౌతమ బుద్ధ గ్రంథాలయంలో బుద్ధుని జయంతిని గురువారం నిర్వహించారు. స్టాలిన్ ముఖ్య అతిథిగా హాజరై బుద్ధుని విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, శాంతి, సామరస్యానికి ప్రతీక బుద్ధుని బోధనలు అన్నారు. అనంతరం గౌతమ బుద్ధ గ్రంథాలయ నిర్వాహకులు ఎస్‌వి.సుబ్బారావును సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకులు జాలాది వెంకటేశ్వరరావు, బాపయ్య, బుచ్చయ్య చౌదరి, వరిష్ఠ పౌరుల సమాఖ్య ప్రతినిధి రమణ రాజు, సిపిఐ నాయకులు క్రి వెంకటేశ్వరరావు, సలీం, రామారావు, అప్పారి దానయ్య, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

కొత్తకోట: రావికమతం మండలంలో కొత్తకోట అంబేద్కర్ కాలనీ -1లో బుద్ధ పౌర్ణమి వేడు కలు గురువారం ఘనంగా నిర్వహించారు. దళిత బహుజన సంక్షేమ సమాజం విశాఖ ఉమ్మడి జిల్లా కన్వీనర్ మల్లేటి రాజు ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ, బుద్ధుని బోధనలు సమాజానికి అవసరమన్నారు. బుద్ధుని విగ్రహం స్థాపనకు కొత్తకోట గ్రామంలో సర్వే నెం 241/1 లో ప్రభుత్వ భూమిని కేటాయిస్తామన్న హామీని అధికారులు నిలబెట్టు కోవాలని డిమాండ్ చేశారు.ముందుగా స్థానిక అంబేద్కర్ కాలనీ సామాజిక భవనంలో బుద్ధుని విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు..ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు...

బుచ్చయ్యపేట : మండలంలోని దిబ్బిడి గ్రామంలో బుద్ధ పౌర్ణమి వేడుకలు గురువారం నిర్వహించారు. ముందుగా బుద్ధుని విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ గొన్నాబత్తుల శ్రీనివాసరావు మాట్లాడుతూ బుద్ధుని బోధనలు సమాజానికి ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. శాంతి సహనంతో ప్రతి ఒక్కరు నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ముమ్మిన నాగరాజు, మండల తెలుగు యువత అధ్యక్షులు సానాపతి మణికంఠ, గంట సన్యాసి నాయుడు, పెద్దిరెడ్డి మాణిక్యం, పెద్దిరెడ్డి జగన్, గొంపా అప్పల నాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.



దిబ్బిడిలో బుద్ధని విగ్రహానికి నివాళులర్పిస్తున్న శ్రీనివాసరావు తదితరులు

వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం

అనకాపల్లి : గౌతమ బుద్ధుని 2568వ జయంతిని పురస్కరించుకొని స్థానిక సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్వర్యంలో విద్యార్థులకు బొజ్జన్న కొండ చరిత్ర-విశిష్టతపై నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు గురువారం అనకాపల్లి ఎంపీ డాక్టర్ బివి.సత్యవతి చేతులమీదుగా బహుమతుల ప్రదానం చేశారు. ముందుగా ఎంపీ సత్యవతి బుద్ధుని చిత్ర పటానికి పూలమాల వేసి బౌద్ధ పూజలు చేశారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బుద్ధుని మెడల్స్, గిఫ్ట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచానికి మొట్టమొదటిగా అహింస, శాంతి, ధర్మ మార్గాలను ప్రబోధించిన గొప్ప మహనీయుడు బుద్ధడని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.విష్ణుమూర్తి అసోసియేషన్ ప్రతినిధులు బల్లా నాగభూషణం, వినకోట నీలేశ్ గుప్తా, పట్నాల కృష్ణమోహన్, రొబ్బి మల్లేశ్వరరావు, కొత్తూర్తి రామారావు, బొడ్డు సోమరాజు, కాపారపు సత్యనారాయణ, అల్లాడ సౌజన్య కుమారి పాల్గొన్నారు.



ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేసిన ఎంపీ సత్యవతి

ఎట్టకేలకు...

డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారం

-20 సెంట్ల స్థలం కేటాయింపు

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండల కేంద్రం లో గత కొంతకాలంగా పట్టిపీడిస్తున్న డంపింగ్ యార్డ్ సమస్య ఎట్టకేలకు పరిష్కారమైంది. పట్టణీకరణ వైపు పరుగులు పెడుతున్న మండల కేంద్రానికి డంపింగ్ యార్డ్ స్థలం కేటాయించాలని గత 20 ఏళ్ళు గా పంచాయతీ సర్పంచులు రెవెన్యూ అధికారులకు దరఖాస్తులు చేస్తున్నారు. మండల కేంద్రంలో డంపింగ్ యార్డ్ కోసం ప్రభుత్వ స్థలం లేదని రెవెన్యూ అధికారులు చేతులెత్తేసారు. ఫలితంగా తహసిల్దార్ కార్యాలయం, సబ్ స్టేషన్, హైస్కూల్ ప్రహారికి అనుకొని ఉన్న ఖాళీ స్థలాలను ఇంతవరకు డంపింగ్ యార్డుగా ఉపయోగిస్తున్నారు. వీటిపై ప్రజలు అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ గత్యంతరం లేక పంచాయతీ సిబ్బంది గ్రామంలోని ఊడ్చిన చెత్తను ఇక్కడే పోగులుగా వేస్తున్నారు. జనావా సాల మధ్య ఉన్న డంపింగ్ యార్డ్ తరలించాలని గ్రామస్తులు సైతం పలుమార్లు జిల్లా కలెక్టర్ స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రీ సర్వేలో రావికమతం గ్రామంలో భీమునిపట్నం -నర్సీపట్నం రోడ్డు కి ఆనుకొని ఉన్న సర్వే నెంబర్ 65-1లో 52 సెంట్లు రోడ్డు పోరంబోకు ఉందని సర్వే అధికారులు ఉందని గుర్తించారు. దీని విలువ ప్రభుత్వ లెక్కల్లో 3 లక్షల రూపాయలు మాత్రమే ఉండగా మార్కెట్ ధర రెండు కోట్లు రూపాయలు వరకు పలుకుతుంది. ఈ భూమికి సంబంధించి ఆక్రమణదారులు ఎటువంటి ఆధారాలు చూపకపోవడంతో రెవెన్యూ అధికారులు సంబంధిత భూమిని స్వాధీనం చేసుకున్నారు. దీనిలో 20 సెంట్లు భూమిని పంచాయతీకి డంపింగ్ యార్డ్ గా కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ప్రస్తుతం జనావాసాల మధ్య ఉన్న కంపోస్టును గురువారం పంచాయతీకి కేటాయించిన డంపింగ్ యార్డ్ లోకి పంచాయతీ సిబ్బంది తరలిస్తున్నారు.



చేపడుతున్న చదును పనులు



ఫిర్యాదు పత్రం ఇస్తున్న మాజీ సర్పంచ్

అధికారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా గొలుగొండ మండలం జోగుంపేట ఆర్బీకేలో స్థానిక వైసీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ చిటికెల వరహాలబాబు చేతుల మీదుగా మండల వ్యవసాయాధికారి, ఆర్బీకే అధికారిణిలు రైతులకు విత్తనాలు పంపిణీ చేశారని, దీనిపై చర్యలు తీసుకోవాలని జోగుంపేట మాజీ సర్పంచ్ సుర్ల సీతారామమూర్తి గురువారం నర్సీపట్నం ఆర్డీఓ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. వ్యవసాయ అధికారులు స్థానిక వైసీపీ నాయకులను పిలిచి ఇలా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిండచం ఎన్నికల ఉల్లంఘటన భేఖాతరు చేయడమే తగదన్నారు.ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వ్యవసాయాధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.



బావిలో చేపడుతున్న పూడికతీత పనులు

బావిలో పూడికతీత పనులు

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని సీతంపాలెం గ్రామంలోని ఎస్సీ కాలనీ బావిలో పూడిక తీత పనులు గురువారం చేపట్టారు.ఈ సందర్భంగా సర్పంచ్ భర్త నాగ అప్పలరాజు మాట్లాడుతూ, ప్రజల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని బావిలో పూడికతీత పనులు చేపట్టి చెత్త తొలగించి, మరో 2 అడుగులు లోతు తవ్వడం జరిగిందన్నారు.

ఓట్ల లెక్కింపునకు ముమ్మర ఏర్పాట్లు

ప్రజాశక్తి - అరకు లోయ:ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపుకు రాజకీయ పార్టీలు సహకరించాలని అరకు అసెంబ్లీ నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి, ఐటిడిఏ పిఓ వి.అభిషేక్ స్పష్టం చేసారు. స్ట్రాంగ్ రూం నుండి ఇవిఎంలు కౌంటింగ్ హాలు తరలించి, ఓట్లు లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు చేసామని చెప్పారు. గురువారం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థులు, పార్టీల ప్రతినిధులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కౌంటింగ్ సమయంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ర్యాలీలకు అనుమతులు లేదన్నారు. గత ఎన్నికలలో పోలిస్తే అరకు వ్యాలీ అసెంబ్లీ నియోజక వర్గంలో పోలింగ్ శాతం పెరిగిందన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు పక్కాగా అమలు చేస్తామన్నారు.



రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు

ఆహ్లాదకరంగా పందూరు రోడ్డు మార్గం

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలో పందూరు గ్రామ ప్రయాణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఈ రహదారికి ఇరువైపులా నాటిన ఎవెన్యూ ప్లాంటేషన్ చెట్లు ఆహ్లాదకరంగా దర్శనమిస్తున్నాయి. పాత గొట్టువాడ నుంచి సుమారు మూడు కిలోమీటర్ల ప్రయాణం వరకు పచ్చని చెట్లు దర్శనం ఇవ్వడంతో వేసవి తాపానికి ఊరటనిస్తోంది. పచ్చని మొక్కలతో పాటు పూల చెట్లు కూడా దర్శనమివ్వడంతో వాహనదారులు, పాదచారులు ఆహ్లాదకర వాతావరణాన్ని ఆనందిస్తున్నారు.ఈ రహదారిపై ప్రయాణం ప్రకృతి ప్రేమికులను ఎంతగానో ఆకట్టుకుంటుంది.



రోడ్డుకు ఇరువైపులా ఉన్న అందమైన పూల చెట్లు

సిపిఎం పోరాటంతో తాగునీరు సరఫరా

ప్రజాశక్తి -అనంతగిరి: తాగునీటి సమస్యను సిపిఎం ఆధ్వర్యన గ్రామస్తులు వినూత్న నిరసన చేపట్టడంతో అధికారుల స్పందించి మరమ్మతు పనులు చేపట్టి తాగునీటిని సరఫరా చేశారని ఆ పార్టీ వార్డు మెంబర్ సోమ్మెల అప్పలరాజు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాన్ షెడ్యూల్ రొంపల్లి పంచాయతీ పరిధి ఎగువగుడ్డి గ్రామంలో పైపులైన్ మరమ్మతు గురై తాగునీటి సరఫరా నిలిచిపోయిందని,దీంతో, బిందెలతో వినూత్న రీతిలో నిరసన చేపట్టామన్నారు.స్పందించిన అధికారులు మరమ్మతులు పనులు చేపట్టి తాగునీటి సరఫరా చేసారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కార్యకర్తలు కె. సింహాచలం, కొత్తయ్య పాల్గొన్నారు.

దోమల మందు పిచికారీ

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని లింగంపేట గ్రామంలో దోమల మందు పిచికారీని వైద్య సిబ్బంది గురువారం నిర్వహించారు. ప్రతీ ఇంటికి వెళ్లి దోమల మందు పిచికారీ చేశారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ పిహెచ్‌సి వైద్యాధికారి శ్యామ్, హెచ్‌సీ ఫకర్ నాయుడు, ఎంపిహెచ్‌ఎ జయకృష్ణ, సిహెచ్‌ఓ ప్రియాంక, ఏఎన్‌ఎం ఉమాదేవి పాల్గొన్నారు. ఆరోగ్య సిబ్బంది జ్వర బాధితులకు రక్తపూతలు తీశారు.



పిచికారీ చేయిస్తున్న వైద్య సిబ్బంది

విద్యార్థులకు బహుముఖ పోటీలు



అవగాహన కల్పిస్తున్న మురళీకృష్ణ

ప్రజాశక్తి-గొలుగొండ:స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం సందర్భంగా గ్రంథాలయాధికారి రాజుబాబు ఆధ్వర్యంలో గురువారం బుక్ రీడింగ్, స్టోరీ టెల్లింగ్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ప్రధమ శ్రేణి గ్రంథ పాలకుడు మురళీకృష్ణ గ్రంథాలయాల ప్రయోజనాలను వివరించారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని విజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు.

అనకాపల్లిడెస్క్:నర్సీపట్నం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారిణి పీ.దమయంతి ఆధ్వర్యంలో గురువారం సమ్మర్ క్యాంపు నిర్వహించారు. రీసోర్స్ పర్సన్ సీహెచ్. భవాని రాష్ట్రంలోని జిల్లాల పేర్లను పిల్లలతో రాయించారు. రిసోర్స్ పర్సన్ పద్మ మాట్లాడుతూ, దురాశ ద్ఖానికి చేటు కథ రూపంలో వివరించారు. బలిఘట్టం ఎస్ఎ(సోషల్), సిహెచ్. రాంకుమార్, సెల్ ఫోన్లతో కలిగే లాభ నష్టాలను తెలిపారు. జీహెచ్ఎస్ క్రాఫ్ట్ ఉపాధ్యాయుని ఎల్.మాధవి పేపర్ తో గులాబీ పువ్వు ఎలా చేయాలో చేసి చూపించి, పిల్లల చేత చేయించారు.

రోలుగుంట:స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపులో భాగంగా గురువారం విద్యార్థులతో కథలు చదివించి నీతి కథలు చెప్పించారు.ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి మాట్లాడుతూ.. వేసవి సెలవుల్లో నిర్వహించే సమ్మర్ క్యాంపులను విద్యార్థులు తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అచ్యుతాపురం:అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా గురువారం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల చిత్రాలను గీశారు. వారు వేసిన బొమ్మలకు రంగులు అద్దారు. ఈ పోటీలను అక్షిత స్కూల్ తెలుగు ఉపాధ్యాయురాలు మాధవి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిత్రలేఖనం ద్వారా ప్రపంచ స్థాయి గుర్తింపు పొందే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. గ్రంథాలయ అధికారి దొడ్డి కోటేశ్వరరావు మాట్లాడుతూ విజేతలకు జూన్ 7న బహుమతుల ప్రదానం జరుగుతుందని చెప్పారు.

చిన్నారుల పట్ల బాధ్యతగా ఉండాలి

ములగాడ : దేశ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించాలని, వారిని విద్యావంతులను చేయాలని పౌర హక్కుల సంఘం విశాఖ జిల్లా అధ్యక్షులు టి.శ్రీరామ్మూర్తి అన్నారు. మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో గురువారం బాలల స్థితిగతులపై ఆయన మాట్లాడారు. బాలల అభివృద్ధికి, సంక్షేమానికి అంతా కృషిచేయాలన్నారు. చిన్నారులు చదువుపై దృష్టి పెట్టాలని, సమాజంలో వస్తున్న మార్పులను తెలుసుకోవాలని, ఇంటి పనులలో తల్లిదండ్రులకు సహాయ పడాలని, క్రమశిక్షణతో ఉండాలని సూచించారు. బుద్ధ పూర్ణిమ సందర్భంగా బుద్ధునికి గ్రంథాలయాధికారి అజయ్ కుమార్, జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి, సీనియర్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయా దేవి, ప్రముఖ కవి కె.సత్తిరాజు నివాళులర్పించారు.



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

యోగాతో ఆరోగ్యం

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్రతిరోజు యోగా చేయడంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని విశ్రాంతి ఉపాధ్యాయులు సూర్యచంద్ర తెలిపారు. నక్కపల్లి శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి గోవిందేశ్వరరావు ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా గురువారం యోగాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విశ్రాంత ఉపాధ్యాయులు సూర్యచంద్ర విద్యార్థులతో యోగాసనాలు వేయించి, కలుగు లాభాలను వివరించారు.



నియామక పత్రాలు అందిస్తున్న అతిథులు

నియామక పత్రాలు అందజేత

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:నర్సీపట్నం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం ఉద్యోగ విజయోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. 2023-2024 వార్షిక సంవత్సరానకు గాను ఉద్యోగాలు పొందిన 56 మంది విద్యార్థినీ విద్యార్థులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంకు ముఖ్య అతిథులుగా ఆల్ ఇండియా రేడియో ఐఎఫ్ఎస్ డైరెక్టర్ ఎంవీ.రత్నప్రసాద్, వాటర్ రీసోర్స్ డిపార్టుమెంట్ డిఈఈ ఎం.రాజేంద్రప్రసాద్, ప్రత్తిపాడు ఆంధ్రామినరల్స్ మైన్స్ మేనేజర్ ఎం.రామస్వామి, కళాశాల ప్రిన్సిపాల్ జీవీ.రామచంద్రరావు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు ఉద్యోగాలు పొందిన విద్యార్థినీ విద్యార్థులను అభినందిస్తూ వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపేలా తగు సూచనలను అందించారు.

నేడు వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు శిక్షణ

ప్రజాశక్తి -నక్కపల్లి :పాయకరావుపేట సబ్ డివిజన్ పరిధిలో 5 మండలాలకు సంబంధించి వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు ఈనెల 24న శుక్రవారం శిక్షణ ఇవ్వనున్నట్లు వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ తెలిపారు. నక్కపల్లిలోని టి.సుబ్బిరామరెడ్డి కళ్యాణ మండపంలో వ్యవసాయ , ఉద్యాన సహాయకులకు వ్యవసాయం, ఉద్యాన పంటల ఉత్పత్తి సాంకేతికతపై శిక్షణను ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో ఇవ్వనున్నట్లు తెలిపారు. వ్యవసాయ, ఉద్యాన సహాయకులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని వేంపాడు సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఈనెల 24న శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీ ట్రాన్స్ కో ఏఈ కృష్ణ గురువారం తెలిపారు. వేంపాడు సబ్ స్టేషన్ పరిధిలో మెయింటెనెన్స్, నెల్లిపూడిలో ఆర్ డి ఎస్ ఎస్ పనులు చేపట్టేందుకు శుక్రవారం ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు వేంపాడు, చినదొడ్డిగల్లు, రేబాక, డొంకాడ, నెల్లిపూడి, గునుపూడి, అమలాపురం, దోసలపాడు, గుల్లిపాడు, రమణయ్యపేట, ముకుంద రాజుపేట, జగన్నాథపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు గ్రహించాలని కోరారు.

ర్యాలీలు, ఊరేగింపులపై నిషేధం

ప్రజాశక్తి-గొలుగొండ: జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో ర్యాలీలు, ఊరేగింపులకు ఎటువంటి అనుమతులు లేవని గొలుగొండ ఎస్సై బి.కృష్ణారావు చెప్పారు. గురువారం ఆయన మాట్లాడుతూ, బాణసంచా విక్రయాలపై నిషేధం ఉందని, ఎవరైనా ఆంక్షలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పకడ్బందీగా ఓట్ల లెక్కింపు

ప్రజాశక్తి -పాడేరు : వచ్చే నెల 4న జరగనున్న ఓట్ల లెక్కింపును అత్యంత ఖచ్చితత్వంతో, పారదర్శకంగా లెక్కించాలని, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం. విజయ సునీత స్పష్టం చేసారు. కలక్టరేట్ విసి సమావేశ మందిరంలో గురువారం ఆర్ ఓలు, ఎఆర్ఓ లతో నిర్వహించిన సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ, ఓట్ల లెక్కింపుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు మునుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు. స్ట్రాంగ్ రూమ్ నుండి ఆయా టేబుల్స్ కు కేటాయించిన ఇవిఎంలను కౌంటింగ్ హాలుకు చేరవేయడం దగ్గరనుండి ప్రతి అంశమూ వీడియో చేయాలని ఆదేశించారు. ఎన్నికల కమిషన్ నిభందనల ప్రకారమే ప్రతి ఒక్కరూ ప్రవర్తిన్చాలన్నారు. కౌంటింగ్ హాల్‌లో 14 టేబుల్స్ ఎదురెదురుగా ఏర్పాటు చేయాలని, ఒక్కో టేబుల్‌కు ఒక కౌంటింగ్ సహాయకులు, ఒక పర్యవేక్షకులు, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారని తెలిపారు. మూడంచెల బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.

వేట లేక.. పూట గడవక..



వేట నిషేధంతో ఒడ్డున ఉన్న పడవలు

ప్రజాశక్తి-నక్కపల్లి : **కష్టమొచ్చినా.. నష్టమొచ్చినా.. గంగమ్మతల్లినే నమ్ముకుని బ్రతికే మత్స్యకారులకు ఇప్పుడు వేట లేక పూటగడవని పరిస్థితిలో ఎదురీదుతూ జీవనం సాగిస్తున్నారు. ఉవ్వెత్తున ఎగసిపడుతున్న అలలు భయపెడుతున్నా బతుకుబండిలాగాలంటే ఎదురొడ్డి వేటాడక తప్పదు. అలా వేటకు వెళ్లి సముద్రంపై జీవన సమరం సాగించి మత్స్యకారులు కుటుంబాలను పోషించుకుంటారు.**

సముద్ర జలాల్లో వివిధ చేపలు, రొయ్య జాతుల సంతానోత్పత్తి కాలంలో తల్లి చేపలు, రొయ్యలను సంరక్షించి వాటి సంతతిని ప్రోత్సహించడం ద్వారా సుస్థిరతను సాధించేందుకు ప్రభుత్వం ఏటా ఏప్రిల్ 14 అర్ధరాత్రి నుంచి జూన్ 14 అర్ధరాత్రి వరకు 61 రోజులపాటు చేపల వేటను నిషేధిస్తుంది. మత్స్యకారులు రెండు నెలలు పాటు వేటకు వెళ్లకపోవడంతో ఆర్థిక కష్టాలతో సతమతమౌతూ కుటుంబాలను పోషించలేని పరిస్థితిలో ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ అందించే వేట నిషేధ భృతి రూ.10 వేలు ఏ మూలకూ సరిపోవడంలేదని, ఇచ్చే పరిహారం కూడా సకాలంలో ఇవ్వడం లేదని మత్స్యకారుల ఆవేదన చెందుతున్నారు.

వేట తప్ప మరే ఇతర పనులు చేయలేక గంగపుత్రులు బతుకులు దయానీయంగా మారాయి. వేట నిషేధ కాలానికి పరిహారం చెల్లించేందుకు కొత్త కొత్త నిబంధనలు పెట్టడంతో చాలా మంది మత్స్యకారులు పరిహారానికి దూరమవుతున్నారు. ఈ ఏడాది వేట నిషేధ కాలానికి సంబంధించి మత్స్యకార భరోసాను అందించేందుకు 2024 సార్వత్రిక ఎన్నికల కారణంగా మే నెలలో మత్స్యకారులకు పరిహారం దక్కే అవకాశం లేదు. వచ్చే నెలలో ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత పరిహారం చెల్లించనున్నారు. ఏ నెలలో వేట నిషేధ భృతి చెల్లిస్తారో కొత్త ప్రభుత్వం నిర్ణయించాల్సి ఉంది.



వలలకు మరమ్మతు పనులు చేస్తున్న మత్స్యకారులు

నిబంధనల పేరుతో కొర్రీలు

మోటర్ బోటుకు ఆరుగురు చొప్పున, సంప్రదాయ ఇంజన్ లేని బోట్లకు ముగ్గురికి చొప్పున పరిహారం చెల్లిస్తున్నారు. లబ్ధిదారుడు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలైన పింఛన్, ఇతర పథకాలలో లబ్ధి పొందినట్లయితే వేట నిషేధ పరిహారం వర్తించదు. కుటుంబంలో ఒకరు ఉద్యోగం కలిగి జీతభత్యం పొందుతున్నా, పెన్షన్ పొందుతున్న రిటైర్డ్ ఉద్యోగి కుటుంబాలకు కూడా ఈ పథకం వర్తించదు. ఇలా పలు నిబంధనలు పేరుతో అధికారులు అనర్హత వేటు వేసి పరిహారం చెల్లించకపోవడం పట్ల మత్స్యకారులు ఆవేదన చెందుతున్నారు. మత్స్యకారులందరికీ వేట నిషేధ పరిహారం చెల్లించే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని మత్స్యకారులు డిమాండ్‌చేస్తున్నారు.

గత ఏడాది ..

పాయకరావుపేట నియోజకవర్గంలో తీర ప్రాంత మండలాలైన నక్కపల్లి, ఎస్.రాయవరం, పాయకరావుపేటలో తీర ప్రాంత గ్రామాల్లో 7374 మందిని అర్హులుగా గుర్తించి పరిహారం చెల్లించారు. పాయకరావుపేట మండలంలో ఇంజన్ బోట్లు 509, సంప్రదాయ బోట్లు 44, నక్కపల్లి మండలంలో ఇంజన్ బోట్లు 395, సంప్రదాయ బోట్లు 99, ఎస్.రాయవరం మండలంలో ఇంజన్ బోట్లు 356, సంప్రదాయ బోట్లు 44లను గుర్తించి గత ఏడాది పరిహారం చెల్లించారు. ఈ ఏడాది మత్స్యకార గ్రామాల్లో వేట నిషేధ కాలానికి సంబంధించి మత్స్యకారులకు పరిహారం చెల్లించుటకు మత్స్య శాఖ అధికారులు ఇప్పటికే సర్వే చేపట్టి జాబితాను ఉన్నతాధికారులకు పంపించారు. ఉన్నతాధికారులు పరిశీలించిన పిదప, అర్హులైన జాబితాను ఆయా గ్రామాల్లో సచివాలయాల వద్ద ప్రదర్శించనున్నారు. ప్రస్తుతం కొత్త జాబితాను ఇంకా వెల్లడించలేదు.

జాబితా సిద్ధం

పాయకరావుపేట నియోజవర్గం పరిధి మూడు మండలాల్లోని మత్స్యకార గ్రామాల్లో ఎన్యూమరేషన్ బృందాలతో సర్వే చేసి జాబితాను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదించాం. అధికారులు పరిశీలించిన పిదప అర్హులు, అనహర్హుల జాబితాను ఆయా గ్రామాల్లో సచివాలయాల్లో ప్రదర్శిస్తాం. అభ్యంతరాలు ఉంటే సచివాలయ ఫిషరీస్ అసిస్టెంట్‌కు తెలియజేస్తే, పరిశీలించి తుది జాబితాను వెల్లడిస్తాం. ఎన్నికల కోడ్ కారణంగా పరిహారం విడుదల కాలేదు.

పి.శ్రుతి, ఎఫ్‌డిఒ

25 వేలు పరిహారం చెల్లించాలి

వేట నిషేధ కాలానికి రూ.25 వేలు చెల్లించాలి. 61 రోజుల వేట నిషేధికాలానికి ప్రభుత్వం రూ.10 వేలు పరిహారం చెల్లిస్తుంది. చాలీచాలని పరిహారంతో కుటుంబ పోషణ కష్టం అవుతుంది. ఇచ్చే పరిహారం కూడా సకాలంలో చెల్లించకపోవడం వలన ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాం.



చేపల సోమేష్ ,
మత్స్యకారుడు, రాజయ్యపేట

లేనిపోని నిబంధనలు

వేట నిషేధ కాలానికి సంబంధించి పరిహారం చెల్లించడంలో అధికారులు కొర్రీలు వేస్తున్నారు. మా అబ్బాయి సచివాలయ ఉద్యోగి. రేషన్ కార్డు ఒక్కటే అవ్వడం వల్ల వేట నిషేధ కాలానికి పరిహారం చెల్లించే విషయంలో నిబంధనల పేరిట కుమారుని ఉద్యోగాన్ని షాకుగా చూపి పరిహారం చెల్లించడం లేదు.



గోసల సోమేశ్వరరావు,
మత్స్యకారుడు, రాజయ్యపేట

హెటిరో కాలుష్యంతో ఉపాధికి దెబ్బ

హెటిరో డ్రగ్స్ కంపెనీ రసాయన వ్యర్థాలను సముద్రంలో వదలడం వల్ల మత్స్య సంపద నశించి పోవడంతో ఉపాధి కోల్పోయాం. సరైన చేపలు పడటం లేదు. ఏదో చిన్నచిన్న చేపలు పడుతున్నా, మందుల వాసన వస్తుంది. దీంతో చేపలు కొనేవారు కూడా ముందుకు రావడం లేదు. పింఛన్ రావడంతో, వేట నిషేధకాలానికి పరిహారం ఇవ్వడంలేదు.



మైలపల్లి దేముడు,
మత్స్యకారుడు రాజయ్యపేట

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి-గొలుగొండ:ఈ నెల 24 నుంచి ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు ప్రారంభం కానున్నాయని కృష్ణదేవిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రుత్తల గంగరాజు బుధవారం తెలిపారు. మొదటి సంవత్సరంకు సంబంధించి 262 మంది, రెండవ సంవత్సరం సంబంధించి 88 మంది పరీక్షలు రాయనున్నారని చెప్పారు. పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. కేంద్రం వద్ద విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించడం జరిగిందని చెప్పారు.

పాడేరు : జిల్లాలో ఈ నెల 24 నుంచి జరగనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను సజావుగా నిర్వహించాలని జిల్లా రెవిన్యూ అధికారి బి.పద్మావతీ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలపై గురువారం డిఆర్ఓ ఛాంబ రులో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడు తూ జిల్లాలో మే 24 నుంచి జూన్ 1వ తేదీ వరకు ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు జరగను న్నాయన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రథమ సంవత్సరం, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరుగుతాయన్నారు. ఈ సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 14162 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు చెప్పారు. ఇందులో పాడేరు డివిజన్ లో 42 కళాశాలలకు చెందిన 7417 మందికి 13 పరీక్షా కేంద్రాలు, రంపచోడవరం డివిజన్ లో 31 కళాశాలలకు చెందిన 6745 మందికి 8 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు వివరించారు. పరీక్షల నిర్వహణ కోసం చీఫ్ సూపరింటెండెంట్లు, శాఖాధికారులు, స్క్వాడ్, రూట్ అధికారులను నియమించడం జరిగిందని తెలిపారు. ఇంటర్మీడియట్ మెయిన్ పరీక్షలు మాదిరిగానే సప్లిమెంటరీ పరీక్షలను కూడా పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. విద్యార్థులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, నిరంతరాయంగా విద్యుత్, తాగునీరు, రవాణా వంటి మౌలిక వసతులను కల్పించాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఇంటర్మీడియట్ విద్య ప్రత్యేక అధికారి యం.వినోద్ బాబు, జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీ, గిరిజన సంక్షేమ ఉపసంచాలకులు కొండలరావు, ఆర్.టి.సి డిపో మేనేజర్ వి.శ్రీనివాస్, రవాణా శాఖ అధికారి ఎస్.లీల ప్రసాద్, సర్కిల్ ఇన్స్పెక్టర్ డి.నవీన్ కుమార్, వైద్య ఆరోగ్య శాఖ స్టేటస్టికల్ ఆఫీసర్ జే.కైలాష్ రావు, తపాలా, విద్యుత్ తదితర శాఖలకు చెందిన అధికార ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.